manavishwam.com

# మన విశ్వం

VOICE OF THE PEOPLE-POWER OF TRUTH

తెలుగు వార్తా దినపత్రిక

MANA VISHWAM TELUGU DAILY








వరంగల్ | సంపుటి : 01 | సంచిక : 70 | బుధవారం 26 ఆగస్టు 2026 | పేజీలు : 8 | వెల : రూ.5 | PRGI, NO : TGTEL/26/A4450 | ఎడిటర్ : నమిండ్ల ప్రమోద్



## మూసీ భూసేకరణలో వేగం పెంచండి



- ల్యాండ్ పూలింగ్‌కు స్పష్టమైన విధానం రూపొందించాలి
- ఫేజ్-2కు త్వరగా టెండర్లు పిలవాలి: సీఎం రేవంత్‌రెడ్డి


వివరాలు 2లో..


## డిసెంబర్‌లో మళ్లీ 'స్థానిక' సమరం!



- రెండో దశ ఎన్నికలకు రంగం సిద్ధం
- ఎస్ఐఆర్ ముగియగానే ఎన్నికల ప్రక్రియకు కసరత్తు
- ఐదు కార్పొరేషన్లపై ప్రధాన దృష్టి
- ఎన్నికలు జరగని మున్సిపాలిటీలకూ మోక్షం!


వివరాలు 2లో..





# 22ఏపై 'కమీషన్'.. పాల కంపెనీపై 'కౌంటర్'!

## హరీశ్-పొంగులేటి మధ్య ఆరోపణల యుద్ధం

- '30 శాతం కోసమే 22ఏ కుట్ర.. లక్షల మంది జీవితాలు ఆగం' : హరీశ్‌రావు
- 'తప్పు ప్రభుత్వానిదైతే ప్రజలకు శిక్ష ఎందుకు?' అంటూ నిలదీత
- 'వైద్యమంత్రిగా ఆసుపత్రులతో వ్యాపారం.. ఇదేం నీతి?' : పొంగులేటి
- 'బండారం బయటపడగానే కంపెనీ వెబ్‌సైట్ ఎందుకు మూసేశారు?' అంటూ ప్రశ్న

ఒకరిది 22ఏ అస్త్రం.. మరొకరిది పాల కంపెనీ ప్రతిఅస్త్రం

**తెలంగాణ బ్యూరో, ఆగస్టు25 (మన విశ్వం):** ఒకరిది '30శాతం కమీషన్ 'ఆరోపణ.. మరొకరిది 'పాల కంపెనీ-ఆసుపత్రుల వ్యాపారం' ప్రత్యారోపణ. 22ఏ భూముల వ్యవహారం కేంద్రంగా మాజీ మంత్రి హరీశ్‌రావు, రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మధ్య మాటల యుద్ధం తీవ్రరూపం దాల్చింది. ప్రజల భూములను 22ఏలో పెట్టి కమీషన్లు దండుకునేందుకు కుట్ర చేశారని హరీశ్ ఆరోపిస్తే.. వైద్యమంత్రిగా ఉన్న సమయంలో ఆసుపత్రులతో వ్యాపారం చేసిన వారు అవినీతి గురించి మాట్లాడటమేమిటని పొంగులేటి ప్రశ్నించారు. ఇద్దరూ ఒకరిపై మరొకరు తీవ్ర ఆరోపణలు సంధించడంతో రాజకీయంగా దుమారం రేగింది.

**'30శాతం కోసమే ఈ కుట్ర' : హరీశ్**

కుత్బుల్లాపూర్‌లో నిర్వహించిన 22ఏ బాధితుల సమావేశంలో హరీశ్‌రావు ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు.' తప్పు పొంగులేటిదయినా.. ప్రభుత్వానిదయినా ప్రజలకు శిక్ష ఎందుకు?' అని ప్రశ్నించారు. డబ్బు సంపాదించాలనే దురాశతో రాత్రికి రాత్రే భూములను 22ఏలో పెట్టారని ఆరోపించారు. '30 శాతం కమీషన్ వసూలు చేసేందుకే ఈ కుట్ర చేశారు. దీనివల్ల లక్షల మంది జీవితాలు ఆగమయ్యాయి' అని ధ్వజమెత్తారు. భూములు ఉన్నా అవసరానికి అమ్ముకోలేని పరిస్థితి కల్పించారని మండిపడ్డారు. పొంగులేటిని ఉద్దేశించి 'డబ్బుపై దురాశే ఏదో ఒకరోజు నీ దుఃఖానికి కారణమవుతుంది 'అంటూ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. 22ఏ బాధితులకు న్యాయం జరిగే వరకు ప్రభుత్వాన్ని నిలదీస్తామని స్పష్టం చేశారు.

**'ఆసుపత్రులతో వ్యాపారం సంగతేంటి?' : పొంగులేటి**

హరీశ్ ఆరోపణలకు పొంగులేటి 'ఎక్స్' వేదికగా అంతే ఘాటుగా స్పందించారు. హరీశ్‌రావుకు సంబంధించినదిగా పేర్కొంటున్న పాలకంపెనీ వ్యవహారాన్ని తెరపైకి తెచ్చారు. ఆ సంస్థ ఖాతాదారుల్లో ఆసుపత్రులు అధికంగా ఉన్నాయని ఆరోపించారు. వైద్యశాఖ మంత్రిగా ఉంటూ ఆసుపత్రులతో వ్యాపారం చేయడం అధికార దుర్వినియోగం కాదా? ఇది హైటెక్ అవినీతి కాదా?' అని ప్రశ్నించారు. ఇతర రాజకీయ నేతలకు సంబంధించిన సంస్థలతోనూ వ్యాపార లావాదేవీలు జరిగా యని ఆరోపించారు.

**'వెబ్‌సైట్ ఎందుకు మూసేశారు?'**

పాల కంపెనీ వ్యవహారం బయటకు రావడంతో దాని వెబ్‌సైట్‌ను


మిగతా 2లో..


# ఏసీపీ లేని వరంగల్

## 'హాట్‌సీట్'కు బాస్ కరవు!

- నెలలుగా ఖాళీగా వరంగల్ ఏసీపీ కుర్చీ
- మూడు కీలక ఠాణాలకు ఇన్‌ఛార్జే దిక్కు
- సమస్య వరంగల్‌లో.. అధికారి హనుమకొండలో!
- రాజకీయంగా కీలక ప్రాంతం.. పూర్తిస్థాయి ఏసీపీ వచ్చేదెప్పుడు?




**వరంగల్ ప్రతినిధి, ఆగస్టు 25 (మన విశ్వం):** మూడు కీలక ఠాణాలు.. నిత్యం నేరాలు, ఫిర్యాదులు.. తరచూ రాజకీయ ర్యాలీలు, ధర్నాలు, ఆందోళనలు. శాంతిభద్రతల పరంగా నిరంతరం అప్రమత్తంగా ఉండాల్సిన వరంగల్ సబ్‌డివిజన్‌కు మాత్రం నెలలుగా పూర్తిస్థాయి ఏసీపీ లేరు. ఏప్రిల్‌లో అధికారి బదిలీపై వెళ్లినప్పటి నుంచి ఖాళీ అయిన కుర్చీ అలాగే ఉంది. హన్మకొండ ఏసీపీకి ఇన్‌ఛార్జ్ బాధ్యతలు అప్పగించి నెట్టుకొస్తున్నారు. ఇంతటి కీలక పోస్టు భర్తీలో జాప్యం ఎందుకన్న ప్రశ్న ఇప్పుడు చర్చనీయాంశమవుతోంది.


**మూడు ఠాణాలు.. ఇన్‌ఛార్జే దిక్కు**

మిల్స్‌కాలనీ, ఇంతేజార్‌గంజ్, మట్టెవాడ ఠాణాలు వరంగల్ సబ్‌డివిజన్ పరిధిలో ఉన్నాయి. జనసాంద్రత, వ్యాపార ప్రాంతాలు, నేర నియంత్రణ, రాజకీయ కార్యకలాపాల పరంగా ఈ ప్రాంతం కీలకం. కేసుల పర్యవేక్షణ, ఠాణాల మధ్య సమన్వయం, శాంతిభద్రతల నిర్వహణలో ఏసీపీ పాత్ర ప్రధానమైనా.. పూర్తిస్థాయి అధికారి లేకపోవడంపై విమర్శలు


మిగతా 2లో..


# సురేఖపై 'వేటు' సిఫార్సు?

- చిన్నారెడ్డికీ పదవీ గండం!
- క్రమశిక్షణ కమిటీ నివేదిక పీసీసీ చీఫ్‌కు..
- కఠిన చర్యలకు సిఫార్సు చేసినట్లు సమాచారం
- తుది నిర్ణయం అధిష్ఠానానిదే.. కాంగ్రెస్‌లో ఉత్కంఠ



నివేదిక సమర్పించిన అనంతరం మీడియాతో మాట్లాడుతున్న మల్లు రవి

**హైదరాబాద్, ఆగస్టు 25 (మన విశ్వం):** మంత్రి కొండా సురేఖ, రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డిపై కాంగ్రెస్ క్రమశిక్షణ కొరడా ఝుళిపించనుందా? ఇద్దరి పదవులపైనా వేటు పడనుందా? క్రమశిక్షణ కమిటీ తాజాగా సమర్పించిన నివేదికతో ఈ అంశం పార్టీ వర్గాల్లో చర్చనీయాంశమైంది. ఎమ్మెల్యే క్వార్టర్స్‌లో పీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్ గౌడ్‌కు క్రమశిక్షణ కమిటీ చైర్మన్ మల్లు రవి, వైస్ చైర్మన్ శ్యామ్‌మోహన్ నివేదిక అందజేశారు. ఇద్దరు నేతలు ఇచ్చిన వివరణలు, తాజా పరిణామాలను పరిశీలించిన అనంతరం కఠిన చర్యలు అవసరమని కమిటీ సిఫార్సు చేసినట్లు సమాచారం. కుమార్తె సుస్మిత చేసిన వ్యాఖ్యలను సురేఖ ఖండించి ఉండాల్సిందని కమిటీ అభిప్రాయపడినట్లు తెలుస్తోంది. పార్టీ నియమాల ఉల్లంఘనను తీవ్రంగా పరిగణిస్తూ సురేఖను మంత్రి పదవి నుండి, చిన్నారెడ్డి ని క్యాబినెట్ ర్యాంకుతో కూడిన ప్రణాళిక సంఘం


మిగతా 2లో..


## విద్యార్థుల జీవితాలతో చెలగాటమొద్దు

మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్



- ఫీజులెప్పుడు?.. భవిష్యత్తు ఏంటి?
- 'సీఎం అంటే నాలుగు కోట్ల మంది గురించి ఆలోచించాలి'
- 20 లక్షల మంది విద్యార్థులకు అండగా భాజపా
- బకాయిలు చెల్లించేదాకా పోరాటం ఆగదు
- రామచందర్‌రావు 48 గంటల దీక్షకు సంపూర్ణ మద్దతు


వివరాలు 2లో..




## నోటీసులయ్యాయ్.. ఇక యాక్షనే!

### వివాదాస్పద భవనంపై చర్యలకు రంగం సిద్ధం


2లో..


- వారం కిందటే నోటీసులు జారీ చేసిన జీడబ్ల్యూఎంసీ
- 2022లో కూల్చివేసిన చోటే మళ్లీ యథాతథంగా నిర్మాణం
- వరుస కథనాలతో వెలుగులోకి తెచ్చిన 'మన విశ్వం'
- నోటీసులతో సరిపెట్టం.. చర్యలు తప్పవు: టీపిబీవో హరీశ్

## 'ప్రపంచ వర్సిటీలపై రేవంత్‌వి గాలి మాటలే!'



- శతాబ్దాల చరిత్ర ఉన్న విశ్వవిద్యాలయాలు సొంత ప్రాంగణాలు దాటి రావు
- హార్వర్డ్, ఎంఐటీ, ఆక్స్‌ఫర్డ్, కేంబ్రిడ్జ్‌ల పేరుతో ప్రజలను మభ్యపెడుతున్నారు
- 'హెలికాప్టర్‌లో తీసుకొచ్చి ఇక్కడ ల్యాండ్ చేయాలనుకుంటే కుదరదు'
- ఫ్యూచర్ సిటీపై సీఎంకు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ కౌంటర్


వివరాలు 2లో..

మన విశ్వం
VOICE OF THE PEOPLE-POWER OF TRUTH

# సొంతింటి కల.. కొత్త తరం లెక్క!



ఒకప్పుడు ఉద్యోగం రాగానే సొంతింటి కోసం అడుగులు పడేవి. స్థలం కొనడం.. ఇల్లు కట్టడం.. సాధ్యం కాకపోతే గృహ రుణంతో ఫ్లాట్ తీసుకోవడం. మధ్యతరగతి జీవితంలో ఇదో ప్రధాన లక్ష్యం. సొంత గూడు ఉంటే భవిష్యత్తుకు భరోసా అనే భావన తరతరాలుగా బలంగా నాటుకుపోయింది. ఇప్పుడు ఆ కల చెదిరిపోలేదు. కానీ దాన్ని సాకారం చేసుకోవడంపై యువత లెక్క మారుతోంది. 'ఎలాగైనా ఇల్లు కొనాలి' అన్న ఆలోచనకు బదులు.. 'ఇప్పుడే కొనడం అవసరమా?' అని ఆలోచిస్తోంది.

ఉపాధి ప్రపంచంలో వచ్చిన మార్పులే ఇందుకు ప్రధాన కారణం. ఒకే ఉద్యోగం.. ఒకే ఊరు.. అక్కడే స్థిర నివాసం అనే పరిస్థితులు తగ్గుతున్నాయి. మెరుగైన అవకాశాల కోసం ఉద్యోగాలు, నగరాలు మారడం సాధారణమైంది. ఐటీ, సేవా రంగాల్లో పనిచేసేవారికి ఈ మార్పులు మరింత సహజం. అలాంటప్పుడు ఒక నగరంలో భారీ మొత్తంతో ఇల్లు కొనుగోలు చేసి, రెండు దశాబ్దాల రుణానికి కట్టుబడటం ఎంతవరకు మేలు అన్న ప్రశ్న తలెత్తుతోంది. ఉద్యోగం ఎక్కడుంటే అక్కడ అద్దెకు ఉంటే స్వేచ్ఛ ఉంటుందన్న భావన పెరుగుతోంది.

ఇళ్ల ధరలు సైతం సొంతింటి కలకు పెద్ద సవాలుగా మారాయి. నగరాల్లోనే కాదు.. శివారు ప్రాంతాల్లోనూ స్థిరాస్తి ధరలు సామాన్యుడికి భారంగా మారుతున్నాయి. ఇంటి కొనుగోలుకు ముందస్తుగానే పెద్ద మొత్తం కావాలి. ఆ తర్వాత 20–25 ఏళ్లపాటు ఈఎంఐలు చెల్లించాలి. సంపాదనలో గణనీయమైన భాగం గృహ రుణానికే వెళ్లిపోతే పొదుపు, ఇతర అవసరాలు, పెట్టుబడులకు అవకాశం తగ్గుతుంది. అందుకే అప్పుల భారం మోస్తూ సొంతింట్లో ఉండటం కంటే.. అద్దెకు ఉంటూ ఆర్థికంగా బలపడటం మంచిదా? అని యువత బేరీజు వేసుకుంటోంది.

పెట్టుబడులపై పెరిగిన అవగాహన ఈ ధోరణికి మరో కారణం. ఒకప్పుడు పొదుపు అంటే బంగారం, భూమి, ఇల్లు. ఇప్పుడు పెట్టుబడి అవకాశాలు విస్తరించాయి. మ్యూచువల్ ఫండ్లు, షేర్లు, వ్యాపారాలు సహా అనేక మార్గాల గురించి యువత తెలుసుకుంటోంది. ఇంటి ముందస్తు చెల్లింపు, ఈఎంఐలకు వెచ్చించే మొత్తాన్ని ఇతర పెట్టుబడులకు మళ్లిస్తే భవిష్యత్తులో మెరుగైన ఆర్థిక స్థితి సాధించవచ్చా? అనే లెక్కలూ వేస్తోంది. భావోద్వేగం కంటే ఆర్థిక సామర్థ్యానికి ప్రాధాన్యం పెరుగుతోంది.

అంతమాత్రాన సొంతింటి ప్రాధాన్యం తగ్గిపోయిందని చెప్పలేం. కుటుంబానికి అది ఇచ్చే భరోసా ప్రత్యేకం. అద్దెల పెరుగుదల, తరచూ ఇళ్లు మారాల్సిన ఇబ్బంది, యజమానుల ఆంక్షలు ఉండవు. పిల్లల చదువులు, కుటుంబ బాధ్యతలు పెరిగేకొద్దీ ఒకచోట స్థిరపడాల్సిన అవసరం ఏర్పడుతుంది. పదవీ విరమణ తర్వాత ఆదాయం తగ్గిన సమయంలో అద్దె భారం లేకుండా సొంత గూడు ఉండటం ఎంతో ఊరటనిస్తుంది. అందుకే యువత సొంతింటిని వద్దనుకోవడం లేదు.. సరైన సమయం కోసం ఎదురుచూస్తోంది.

ఇంటిని చూసే కోణమూ మారింది. 'మనకో ఇల్లు ఉండాలి' అన్న భావనతోనే కొనుగోలు చేయడం కాకుండా.. ప్రాంతం ఎలా ఉంది? రవాణా సౌకర్యాలున్నాయా? ఉద్యోగ కేంద్రాలకు దగ్గరగా ఉందా? భవిష్యత్తులో ధర పెరుగుతుందా? అద్దె ఆదాయం వస్తుందా? వంటి అంశాలను పరిశీలిస్తున్నారు. నివాసంతోపాటు పెట్టుబడిగానూ స్థిరాస్తిని అంచనా వేస్తున్నారు.

ఈ మార్పును రియల్ ఎస్టేట్ రంగమూ గుర్తించాలి. యువత ఆదాయానికి అందని ధరలు, భారీ గృహాలకే పరిమితమైతే కొనుగోలుదారులను ఆకర్షించడం కష్టమే. అందుబాటు ధరలు, చిన్న కుటుంబాలకు అనువైన ఇళ్లు, మెరుగైన రవాణా, విద్య, వైద్యం, ఉపాధి కేంద్రాలకు చేరువ.. ఇవే రేపటి గృహ మార్కెట్‌ను నిర్ణయించే అంశాలు. కొత్త తరం అవసరాలకు అనుగుణంగా నిర్మాణ రంగం మారాల్సిన అవసరం ఉంది.

సొంతిల్లు కొనడమా.. అద్దెకు ఉండటమా అన్నదానికి ఒకే సూత్రం లేదు. ఆదాయం, ఉద్యోగ స్థిరత్వం, కుటుంబ అవసరాలు, భవిష్యత్ ప్రణాళికలు, రుణం చెల్లించే సామర్థ్యం ఆధారంగానే నిర్ణయం ఉండాలి. ఇతరులు కొన్నారని అప్పుల ఊబిలోకి దిగడం ఎంత తప్పో.. సొంతింటి అవసరం ఉన్నా పెట్టుబడుల పేరుతో నిరవధికంగా వాయిదా వేయడమూ అంతే సరికాదు.

సొంతింటి కల అలాగే ఉంది. మారింది దాన్ని చేరుకునే దారి. అప్పు చేసైనా ఇల్లు కొనాలన్న ఆత్రం స్థానంలో.. ఆర్థికంగా నిలదొక్కుకున్నాకే అడుగు వేయాలన్న ఆలోచన పెరుగుతుంది. నాలుగు గోడలు సొంతమవడమే భద్రత కాదు. వాటి కోసం చేసిన అప్పులు జీవితాన్ని భారంగా మార్చకపోవడమూ అంతే ముఖ్యం. సొంతింటితోపాటు ఆర్థిక స్వేచ్ఛనూ కాపాడుకోగలిగినప్పుడే ఆ కలకు నిజమైన సార్థకత.

**– నమిండ్ల. ప్రమోద్, ఎడిటర్**

# విద్యార్థుల జీవితాలతో చెలగాటమొద్దు: ఈటల

- **ఫీజులెప్పుడు?.. భవిష్యత్తు ఏంటి?**
- **'సీఎం అంటే నాలుగు కోట్ల మంది గురించి ఆలోచించాలి'**
- **20 లక్షల మంది విద్యార్థులకు అండగా భాజపా**
- **బకాయిలు చెల్లించేదాకా పోరాటం ఆగదు**
- **రామచందర్‌రావు 48 గంటల దీక్షకు సంపూర్ణ మద్దతు**

**హైదరాబాద్, ఆగస్టు 25(మన విశ్వం) :** ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలపై రాష్ట్ర ప్రభుత్వాన్ని మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ నిలదీశారు. లక్షల మంది విద్యార్థుల చదువులు, భవిష్యత్తు ముడిపడి ఉన్న అంశంలో ఇంత నిర్లక్ష్యమా? అంటూ మండిపడ్డారు." ముఖ్యమంత్రి అంటే అర్థమేంటో తెలుసా? నాలుగు కోట్ల తెలంగాణ ప్రజల గురించి ఆలోచించాల్సిన బాధ్యత ఆ పదవిలో ఉన్న వ్యక్తి పై ఉంటుంది" అంటూ సీఎం రేవంత్‌రెడ్డిని ఉద్దేశించి ఘాటు వ్యాఖ్యలు చేశారు. 'ఫీజు బకాయి--భాజపా లడాయ్' కార్యక్రమంలో పాల్గొన్న ఈటల.. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం ఒక్కసారి విద్యార్థులు, వారి తల్లిదండ్రుల పరిస్థితిని ఆలోచించాలని సూచించారు. బకాయిలు పేరుకుపోవడంతో పేద, మధ్యతరగతి కుటుంబాల పిల్లల చదువులు ఇబ్బందుల్లో పడుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు.

**కలలు వారివి.. బాధ్యత ప్రభుత్వానిది**

పేద కుటుంబంలో పుట్టిన విద్యార్థికీ డాక్టర్, ఇంజినీర్, న్యాయవాది, ఉన్నతాధికారి కావాలనే కల ఉంటుందని ఈటల పేర్కొన్నారు. ఆర్థిక ఇబ్బందులు వారి ఉన్నత చదువులకు అడ్డంకిగా మారకుండా చూడాల్సిన బాధ్యత ప్రభుత్వానిదన్నారు. పేద పిల్లలు ఉన్నతంగా చదివి జీవితంలో ఎదగడమే నిజమైన తెలంగాణ అభివృద్ధి " అని వ్యాఖ్యానించారు. విద్యార్థులు నాణ్యమైన విద్యను అందుకుని, ఆరోగ్యవంతులుగా ఎదగాలని ఆకాంక్షించే నాయకుడు ప్రధాని నరేంద్ర మోదీ అని పేర్కొన్నారు. తెలంగాణలోని సుమారు 20 లక్షల మంది విద్యార్థుల భవిష్యత్తుకు అండగా నిలిచే బాధ్యతను భాజపా తీసుకుందని చెప్పారు.

**బకాయిలు తీరేదాకా 'లడాయ్'**

విద్యార్థుల కోసం రామచందర్‌రావు చేపట్టిన 48 గంటల దీక్షకు భాజపా సంపూర్ణ మద్దతు ఉంటుందని ఈటల ప్రకటించారు. లక్షల మంది విద్యార్థుల భవిష్యత్ తో చెలగాటమాడొద్దు. ఫీజు రీయింబర్స్ మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలి " అని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బకాయిలు చెల్లించి విద్యార్థులకు న్యాయం చేసే వరకు పోరాటం ఆగదని స్పష్టం చేశారు. విద్యార్థుల చదువుల విషయంలో ప్రభుత్వం తాత్సారం వీడి తక్షణ నిర్ణయం తీసుకోవాలని ఈటల డిమాండ్ చేశారు.

# 'ప్రపంచ వర్సిటీలపై రేవంత్‌వి గాలి మాటలే!'

**హైదరాబాద్, ఆగస్టు 25 (మన విశ్వం):** ప్రపంచ ప్రఖ్యాత విశ్వవిద్యాలయాలను ఫ్యూచర్ సిటీకి తీసుకొస్తామంటూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేస్తున్న ప్రకటనలు ఆచరణ సాధ్యం కానివని బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ విమర్శించారు. వందల ఏళ్ల చరిత్ర కలిగిన ప్రముఖ విశ్వవిద్యాలయాలు తమ ప్రధాన ప్రాంగణాలను దాటి ఇతర దేశాల్లో క్యాంపస్‌లు ఏర్పాటు చేయవని, అలాంటి సంస్థలను తెలంగాణకు తీసుకొస్తామంటూ ప్రజల్లో ఆశలు కల్పించడం సరికాదన్నారు. తెలంగాణ భవన్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. హార్వర్డ్, ఎంఐటీ, ఆక్స్‌ఫర్డ్, కేంబ్రిడ్జ్ వంటి ప్రపంచ ప్రఖ్యాత విద్యాసంస్థలకు శతాబ్దాల చరిత్ర ఉందని ప్రవీణ్‌కుమార్ పేర్కొన్నారు. ఆయా విశ్వవిద్యాలయాలు తమ సంప్రదాయ ప్రాంగణాలకు అత్యంత ప్రాధాన్యం ఇస్తాయని చెప్పారు. హార్వర్డ్, ఎంఐటీతోపాటు ఆక్స్‌ఫర్డ్, కేంబ్రిడ్జ్ వంటి సంస్థలు తెలంగాణలో పూర్తిస్థాయి క్యాంపస్‌లు ఏర్పాటు చేస్తాయన్న ప్రచారం వాస్తవ పరిస్థితులకు దూరంగా ఉందని వ్యాఖ్యానించారు.

**'ఐవీ లీగ్ పేర్లు చెప్పడం తేలికే'**

హార్వర్డ్, ప్రిన్స్‌టన్, యేల్, డార్ట్‌మౌత్, బ్రౌన్, కొలంబియా, కార్నెల్ వంటి ప్రతిష్ఠాత్మక విద్యాసంస్థల పేర్లు చెప్పడం తేలికేనని, కానీ వాటి క్యాంపస్‌లను తెలంగాణకు తీసుకురావడం అంత సులభం కాదని ప్రవీణ్‌కుమార్ అన్నారు. ఈ అంశంపై ముఖ్యమంత్రికి ఉన్నతాధికారులు వాస్తవ పరిస్థితులను వివరించారా? లేదా? అన్నది తనకు తెలియదన్నారు.

**'హెలికాప్టర్‌లో తెచ్చి దింపితే వచ్చేవి కావు'**

"200–300 ఏళ్లకుపైగా చరిత్ర ఉన్న విశ్వవిద్యాలయాలను హెలికాప్టర్‌లో తీసుకొచ్చి ఫ్యూచర్ సిటీలో ల్యాండ్ చేయాలనుకుంటే సాధ్యమయ్యే పని కాదు. ప్రపంచస్థాయి విద్యాసంస్థలను తీసుకొస్తామంటూ భారీ ప్రకటనలు చేయడం కాకుండా.. ఆచరణలో ఏది సాధ్యమో ప్రజలకు చెప్పాలి" అని ప్రవీణ్‌కుమార్ వ్యాఖ్యానించారు. ఫ్యూచర్ సిటీ పేరుతో అసాధ్యమైన హామీలు ఇవ్వకుండా విద్యారంగ అభివృద్ధికి వాస్తవిక ప్రణాళికను ప్రభుత్వం వెల్లడించాలని డిమాండ్ చేశారు.

# నోటీసులయ్యాయ్.. ఇక యాక్షనే!

- **వారం కిందటే నోటీసులు జారీ చేసిన జీడబ్ల్యూఎంసీ**
- **2022లో కూల్చివేసిన చోటే మళ్లీ యథాతథంగా నిర్మాణం**
- **వరుస కథనాలతో వెలుగులోకి తెచ్చిన 'మన విశ్వం'**
- **నోటీసులతో సరిపెట్టం.. చర్యలు తప్పవు: టీపీబీవో హరీష్**

## వివాదాస్పద భవనంపై చర్యలకు రంగం సిద్ధం

**హన్మకొండ, ఆగస్టు 25 (మన విశ్వం):** ఒకసారి కూల్చివేసిన భవనం.. అదే చోట మళ్లీ యథాతథంగా నిర్మాణం.. దీనిపై వరుసగా వెలుగులోకి వస్తున్న అంశాల నేపథ్యంలో గ్రేటర్ వరంగల్ నగరపాలక సంస్థ చర్యలకు సిద్ధమైంది. హనుమకొండ అదాలత్ జంక్షన్‌లోని చోటి మసీదు పక్కన ఉన్న వివాదాస్పద భవనానికి ఇప్పటికే నోటీసులు జారీ చేసినట్లు టీపీబీవో హరీష్ స్పష్టం చేశారు. నోటీసులు ఇచ్చి వారం రోజులైందని, తదుపరి చర్యలు తీసుకునే ప్రక్రియ కొనసాగుతోందని తెలిపారు.

**2022లోనే కూల్చివేత**

ఈ భవనంపై గతంలోనే జీడబ్ల్యూఎంసీ చర్యలు చేపట్టింది. 2022లో నిబంధనలకు విరుద్ధంగా ఉన్న నిర్మాణంలో కొంత భాగాన్ని టౌన్ ప్లానింగ్ అధికారులు కూల్చివేశారు. అయితే కొంతకాలం తర్వాత అదే ప్రాంతంలో మళ్లీ నిర్మాణం చేపట్టి యథాతథ స్థితికి తీసుకొచ్చారనే అంశాన్ని 'మన విశ్వం' వరుస కథనాల ద్వారా వెలుగులోకి తెచ్చింది.

**నోటీసులతోనే సరి కాదు..**

ఒకసారి కూల్చివేసిన నిర్మాణం తిరిగి ఎలా వెలిసింది? పునర్నిర్మాణానికి అనుమతులు ఉన్నాయా? గతంలో చర్యలు తీసుకున్న భవనం విషయంలో పర్యవేక్షణ ఎందుకు కొరవడింది? అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ఈ నేపథ్యంలో జీడబ్ల్యూఎంసీ అధికారులు స్పందించి భవనానికి నోటీసులు జారీ చేశారు. కేవలం నోటీసులతోనే వ్యవహారాన్ని ముగించబోమని, నిభంధనల మేరకు సీరియస్ యాక్షన్ తీసుకుంటామని టీపీబీవో హరీష్ స్పష్టం చేశారు.దీంతో ఈసారి జీడబ్ల్యూఎంసీ చర్యలు ఏ స్థాయిలో ఉంటాయన్నది ఆసక్తికరంగా మారింది.

# మూసీ భూసేకరణలో వేగం పెంచండి

- **ల్యాండ్ పూలింగ్‌కు స్పష్టమైన విధానం రూపొందించాలి**
- **ఫేజ్-2కు త్వరగా టెండర్లు పిలవాలి: సీఎం రేవంత్‌రెడ్డి**

**హైదరాబాద్, ఆగస్టు 25 (మన విశ్వం):** మూసీ పునరుజ్జీవానికి భూసేకరణలో వేగం పెంచాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధికారు లను ఆదేశించారు. భూముల సమీకరణకు ల్యాండ్ పూలింగ్ విధానాన్ని పక్కాగా రూపొం దించాలని, ఎక్కడా న్యాయపరమైన చిక్కులు తలెత్తకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాల ని స్పష్టం చేశారు. మూసీ రివర్‌ఫ్రంట్ డెవలప్ మెంట్‌పై ఎంసీఆర్ హెచ్‌ఆర్‌డీలోని బోధి పెవి లియన్‌లో మంగళవారం ఆయన ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు.

**రెండో దశకు టెండర్లు**

మూసీ రివర్‌ఫ్రంట్ ప్రాజెక్టు ఫేజ్–2 పనులకు వీలైనంత త్వరగా టెండర్లు పిలవాలని సీఎం సూచించారు. ప్రాజెక్టుకు అవసరమైన భూము ల సేకరణలో జాప్యానికి తావివ్వొద్దన్నారు. ఎఫ్టీ ఎల్, బఫర్ జోన్, అసైన్డ్ భూముల విషయం లో అనుసరించాల్సిన విధానాన్ని స్పష్టంగా ఖరా రు చేయాలని అధికారులకు దిశానిర్దేశం చేశా రు. భవిష్యత్తులో కోర్టు వివాదాలకు ఆస్కారం లేకుండా నిబంధనలు, న్యాయపరమైన అంశా లను క్షుణ్ణంగా పరిశీలించాలని చెప్పారు.

**నిధుల సమీకరణపైనా దృష్టి**

రివర్‌ఫ్రంట్‌లో చేపట్టే ప్రాజెక్టులకు తక్కువ వడ్డీకే రుణాలు సమకూర్చుకునే అవకాశాలను అన్వేషించాలని మున్సిపల్ కమిషనర్లకు సీఎం సూచించారు. భూసేకరణకు సంబంధించి టీడీఆర్ ల జారీలో జాప్యం వద్దని, వాటి పురోగతిని ప్రతి వారం సమీక్షించాలని ఆదేశించారు.

**ఓంకారేశ్వర ఆలయానికి టెండర్లు**

గండిపేట మంచిరేవుల సమీపంలో నిర్మించ ను న్న ఓంకారేశ్వరస్వామి ఆలయానికి తక్ష ణమే టెండర్లు పిలవాలని సీఎం ఆదేశించా రు. కొత్వాల్‌గూడ బర్డ్స్ పార్క్‌కు విస్తృత ప్ర చారం కల్పించి మరింత మందిని ఆకర్షించే లా చర్యలు చేపట్టాలని సూచించారు. సమా వేశంలో హెచ్ ఎండీఏ, జీహెచ్ఎంసీ, సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు, రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల కలెక్టర్లు, ఎంఆర్‌డీసీఎల్ ఎండీ, జేఎండీ తదితర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# 22ఏపై 'కమీషన్'.. పాల కంపెనీపై 'కౌంటర్'!

(మొదటిపేజీ తరువాయి)

మూసేశారని పొంగులేటి ఆరోపించారు.' అంతా సక్రమంగానే ఉంటే కంపెనీ వెబ్ సైట్ ను ఎందుకు మూసేశారు? దాచాల్సిన అవసరం ఏమొచ్చింది?' అని ప్రశ్నించారు. బీఆర్ఎస్ పాలనలో హరీశ్‌రావు 'ఆర్థిక ఆరోగ్యం' ఎలా మెరుగుపడిందో చెప్పాలని డిమాండ్ చేశారు. పాల కంపెనీ వ్యవహారం ఒక ఉదాహరణ మాత్రమేనని, తవ్వేకొద్దీ మరిన్ని విషయాలు బయటపడతాయని వ్యాఖ్యానించారు.

**ఒకరిది 22ఏ.. మరొకరిది పాల కంపెనీ!**

హరీశ్‌రావు 22 ఏ –30శాతం కమీషన్ ఆరో పణలతో పొంగులేటిని లక్ష్యంగా చేసుకోగా.. పొంగులేటి పాల కంపెనీ –ఆసుపత్రుల వ్యాపా రం ఆరోపణలతో హరీశ్‌కు కౌంటర్ ఇచ్చారు. ఒకరు ప్రస్తుత ప్రభుత్వంపై అవినీతి ఆరోపణ లు చేస్తుంటే.. మరొకరు గత ప్రభుత్వంలోని వ్యవహారాలను ప్రశ్నిస్తున్నారు. పరస్పర ఆరోపణలతో 22ఏ వివాదం కాస్తా ఇద్దరు నేతల మధ్య రాజకీయ సమరంగా మారింది.

# సురేఖపై 'వేటు' సిఫార్సు?

(మొదటిపేజీ తరువాయి)

ఉపాధ్యక్ష పదవి నుంచి తప్పించాలని సిఫార్సు చేసినట్లు పార్టీ వర్గాల్లో ప్రచారం జరుగుతుంది. అయితే దీనిపై అధికారిక ప్రకటన వెలువడలే దు. నివేదిక సమర్పణ అనంతరం మల్లు రవి మాట్లాడుతూ.. పార్టీ గౌరవాన్ని దెబ్బతీసేలా ఎవరూ వ్యవహరించకూడదన్నారు. "హద్దులు దాటిన నేతలకు స్పష్టమైన హెచ్చరిక అవసరం. క్రమ శిక్షణ చర్యలు కఠినంగా ఉండాలని నివే దిక ఇచ్చాం " అని తెలిపారు. నివేదికను రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌ఛార్జి మీనాక్షి నటరా జన్‌తోపాటు ఏఐసీసీ అధిష్ఠానానికి పంపనున్న ట్లు చెప్పారు. దీంతో సురేఖ, చిన్నారెడ్డి పై అధిష్టానం ఎలాంటి నిర్ణయం తీసుకుంటుంద న్నది ఉత్కంఠగా మారింది. హెచ్చరికతో సరిపె డుతుందా? లేక పదవుల నుంచి తప్పిస్తుందా? అన్నది కాంగ్రెస్‌లో చర్చనీయాంశమైంది.

# ఏసీపీ లేని వరంగల్

(మొదటిపేజీ తరువాయి)

వ్యక్తమవుతున్నాయి.

**సమస్య ఇక్కడ.. అధికారి అక్కడ!**

స్టేషన్ స్థాయిలో పరిష్కారం కాని ఫిర్యాదులతో ఏసీపీని ఆశ్రయించాలంటే వరంగల్ ప్రజలు హన్మకొండకు వెళ్లాల్సి వస్తోంది. ముఖ్యంగా మహిళలు, వృద్ధులు, సామాన్యులకు ఇది ఇబ్బందికరంగా మారుతోంది. ప్రజలకు అందుబాటులో ఉండాల్సిన ఉన్నతాధికారి మరో సబ్‌డివిజన్‌లో ఉంటే సత్వర స్పందన ఎలా సాధ్యమన్న ప్రశ్న వినిపిస్తోంది.

**రాజకీయంగా 'హాట్'.. కుర్చీ ఖాళీ!**

వరంగల్ తూర్పు రాజకీయంగా కీలక ప్రాంతం. సభలు, ర్యాలీలు, ధర్నాలు, నిరసనలు తరచూ జరుగుతుంటాయి. అప్పుడప్పుడు ఉద్రిక్త పరిస్థితులూ తలెత్తుతాయి. ఇలాంటి ప్రాంతంలో క్షేత్రస్థాయి పర్యవేక్షణకు పూర్తిస్థాయి ఏసీపీ అవసరం మరింత ఎక్కువ. అయినా నెలలుగా పోస్టు ఖాళీగా ఉండటం చర్చకు దారితీస్తోంది.

**'హాట్‌సీట్'కు వచ్చేదెవరు?**

వరంగల్ ఏసీపీ పోస్టు గతంలోనూ వివాదాలు, బదిలీలతో చర్చల్లో నిలిచింది. రాజకీయ ఒత్తిళ్లు ఎక్కువగా ఉండే పోస్టుగా పోలీసు వర్గాల్లో ప్రచారం ఉంది. దీంతో ఈ 'హాట్‌సీట్'లో కూర్చునేందుకు అధికారులే వెనుకంజ వేస్తున్నారా? లేక నియామకంలోనే తాత్సారం జరుగుతోందా? అన్న సందేహాలు వ్యక్తమవుతున్నాయి. ఒకే అధికారికి రెండు సబ్ డివిజన్ల బాధ్యతలు అప్పగించి ఇంకెన్నాళ్లు నెట్టుకొస్తారు? వరంగల్ కు పూర్తిస్థాయి ఏసీపీ ఏసీపీ ని ఎప్పుడు నియమిస్తారు? అన్న ప్రశ్నలకు పోలీసు ఉన్నతాధికారులే సమాధానం చెప్పాల్సి ఉంది.

# డిసెంబర్‌లో మళ్లీ 'స్థానిక' సమరం!

**హైదరాబాద్, ఆగస్టు 25 (మన విశ్వం):** రాష్ట్రంలో మరోసారి స్థానిక ఎన్నికల సందడి మొదలయ్యే సూచనలు కనిపిస్తున్నాయి. రెండో దశ పట్టణ స్థానిక సంస్థల ఎన్నికలను డిసెం బర్‌లో నిర్వహించే దిశగా కసరత్తు జరుగుతు న్నట్లు సమాచారం. ప్రస్తుతం కొనసాగుతున్న ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ (ఎస్ ఐఆర్) పూర్తయిన తర్వాత ఎన్నికల ప్రక్రియకు మార్గం సుగమమవుతుందని అధికార వర్గాల్లో చర్చ జరుగుతోంది. ఈ విడతలో ప్రధానంగా సైబరాబాద్, మల్కాజ్ గిరి,హైదరాబాద్, వరం గల్, ఖమ్మం ఎన్నికలు నిర్వహించే అంశం పరిశీలనలో ఉన్నట్లు తెలుస్తోంది. గత పట్టణ స్థానిక సంస్థల ఎన్నికల సమయంలో ఎన్నిక లు జరగని సంస్థలను ఈసారి ఒకేసారి ఎన్ని కల బరిలోకి తీసుకురావాలనే యోచన ఉన్నట్లు సమాచారం.

**కొత్త కార్పొరేషన్లకు తొలి పరీక్ష!**

హైదరాబాద్ మహానగర పునర్వ్యవస్థీకరణలో భాగంగా ఏర్పాటైన సైబరాబాద్, మల్కాజిగిరి కార్పొరేషన్ లకు ఇప్పటివరకు ప్రజాప్రతినిధు ల ఎన్నికలు జరగలేదు. ప్రస్తుతం ప్రత్యేక అధి కారుల పాలనలో ఉన్న ఈ సంస్థలకు ఎన్నిక లు జరిగితే ఇదే తొలి ఎన్నికల సమరం కా నుంది. దీంతో ఈ రెండు కార్పొరేషన్లపై ప్రధాన రాజకీయ పార్టీల దృష్టి కేంద్రీకృత మయ్యే అవకాశం ఉంది.

**పెండింగ్ పురపాలికలకూ ఎన్నికలు?**

వివిధ న్యాయ, పరిపాలనాపరమైన కారణాల తో ఎన్నికలకు నోచుకోని అచ్చంపేట, మంద మర్రి, మణుగూరు, నకిరేకల్, కొత్తూరు, సిద్ది పేట మున్సిపాలిటీ లను కూడా రెండో దశలో చేర్చే అంశం పరిశీలనలో ఉన్నట్లు సమాచా రం. వీటికి ఎన్నికలు నిర్వహించేందుకు అవసరమైన ప్రక్రియను పూర్తి చేసే దిశగా అధికారులు దృష్టి సారించినట్లు తెలుస్తోంది.

**ఎస్ఐఆర్ తర్వాతే వేగం**

ఎస్ఐఆర్ పూర్తయి తుది ఓటరు జాబితా అందుబాటులోకి వచ్చిన తర్వాత ఎన్నికల సన్నాహాలు ఊపందుకోనున్నాయి. వార్డుల వారీగా ఓటర్ల జాబితాలు, పోలింగ్ కేంద్రాల ఖరారు, సిబ్బంది నియామకం తదితర ఏర్పాట్లు చేపట్టాల్సి ఉంటుంది. రాష్ట్ర ఎన్నికల సంఘం సైతం అవసరమైన ప్రాథమిక అంశాలపై దృష్టి పెట్టినట్లు సమాచారం. డిసెంబర్‌లో ఎన్నికలు జరిగితే హైదరాబాద్, సైబరాబాద్, మల్కాజ్ గిరి, వరంగల్, ఖమ్మం కార్పొరేషన్ల పోరు రాష్ట్ర రాజకీయాల్లో కీలకంగా మారనుంది. ముఖ్యంగా రాజధాని పరిధిలోని కార్పొరేషన్లపై పట్టు కోసం ప్రధాన పార్టీల మధ్య హోరాహోరీ తప్పదనే అంచనాలున్నాయి. అధికారిక ఎన్నికల షెడ్యూల్‌పై ఇంకా స్పష్టత రావాల్సి ఉండగా.. రాజకీయ పార్టీలు మాత్రం ఇప్పటి నుంచే స్థానిక సమరానికి వ్యూహాలు సిద్ధం చేసుకుంటున్నాయి.

## మృతుల కుటుంబాలకు పుట్ట మధుకర్ పరామర్శ

**- అంతిమయాత్రలో పాల్గొని మల్లయ్యకు నివాళి**
**- మల్లారం గ్రామంలో బాధిత కుటుంబాలకు ఓదార్పు**



**మల్హర్, ఆగస్టు 25 (మన విశ్వం):** మల్హర్ మండలంలో మాజీ ఎమ్మెల్యే పుట్ట మధుకర్ మంగళవారం పర్యటించి ఇటీవల మృతి చెందిన పలువురి కుటుంబాలను పరామర్శి ంచారు. బాధిత కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. చిన్నతూండ్ల మాజీ సర్పంచ్ పులిగంటి మమత నర్సయ్య తండ్రి మల్లయ్య మృతి చెందడంతో ఆయన అంతిమయాత్రలో పుట్ట మధుకర్ పాల్గొన్నారు. మల్లయ్య పార్థివదేహానికి పూలమాల వేసి నివాళులర్పించి కుటుంబ సభ్యులను ఓదార్చారు. అనంతరం మల్లారం గ్రామానికి చెందిన వార్డు సభ్యుడు దేనవేన దేవేందర్ తండ్రి దేనవేన రాయమల్లు, గడ్డం పోచమ్మ మృతి పట్ల సంతాపం వ్యక్తం చేశారు. వారి ఇళ్లకు వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ కార్యక్రమాల్లో మాజీ జడ్పీటీసీ గోనే శ్రీనివాస్‌రావు, బీఆర్‌ఎస్ మండల యూత్ అధ్యక్షుడు జాగరి హరీష్, ఉపసర్పంచ్‌లు పులిగంటి రాములు, అవిరినేని పురుషోత్తంరావు, వార్డు సభ్యులు కోట చంద్రమౌళి, భోగె సదానందం, నాయకులు మిరియాల పద్దురావు, కూర సత్తయ్య, అజ్మీర దేవేందర్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజలను రెచ్చగొట్టడం నాయకత్వం కాదు: సిర్పూర్ నాయకులు రావి శ్రీనివాస్

**కొమరం భీం, ఆగస్టు 25(మన విశ్వం) :** ప్రజలను అధికారులపై దాడులకు ఉసిగొల్పడం నాయకత్వం కాదని, వారి సమస్యలపై ముందుండి పోరాడటమే నిజమైన నాయకత్వమని సిర్పూర్ నియోజకవర్గ నాయకులు రావి శ్రీనివాస్ పేర్కొన్నారు. తన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ?గతంలో పెంచికల్పేట్ మండల కేంద్రంలో జరిగిన సర్వసభ్య సమావేశంలో ఎమ్మెల్యే పాల్వాయి హరీష్ బాబు అటవీ అధికారులపై తిరగబడాలని ప్రజలను రెచ్చగొట్టారని, దీనిపై ఇప్పటికే జిల్లా ఎస్పీకి ఫిర్యాదు చేశామని గుర్తు చేశారు. ఎమ్మెల్యే మాటల ప్రభావంతోనే కౌటాల మండలం కనికి గ్రామంలో అటవీ అధికారులపై దాడికి పాల్పడ్డారని ఆరోపించారు. ప్రజలపై కేసులు నమోదైతే వారు తన వెంటే



తిరుగుతారనే దురుద్దేశంతోనే ఎమ్మెల్యే ఇలాంటి రెచ్చగొట్టే చర్యలకు పాల్పడుతున్నారని విమర్శించారు. దీనివల్ల 3-4 ఎకరాలు సాగుచేసుకునే రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.?అధికారులపై జరిగిన దాడి ఘటనలో శ్రీనివాస్ గౌడ్‌ను ఏ1గా చేర్చారని, రెచ్చగొట్టిన ఎమ్మెల్యే హరీష్ బాబును ఏ2గా చేర్చాలని రావి శ్రీనివాస్ డిమాండ్ చేశారు. పోలీసులు కేసు నమోదు చేయని పక్షంలో కోర్టు ద్వారా ప్రైవేట్ కేసు దాఖలు చేస్తామని హెచ్చరించారు. స్థానిక ఎమ్మెల్యే తీరు వల్ల ఈ ప్రాంతం మరింత వెనుకబడిందని విమర్శించారు. ?రానున్న రోజుల్లో సిర్పూర్ నియోజకవర్గంలో పాదయాత్ర చేపట్టి గడపగడపకూ వెళ్లి ప్రజల కష్టాలను తెలుసుకుంటామని, న్యాయం కోసం నిరంతరం పోరాడతామని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో వివిధ మండలాల సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## కార్మిక సమస్యల పరిష్కారానికి కృషి చేస్తాం: ఎమ్మెల్సీ దండే విఠల్, సుగుణక్క



**కొముురం భీం, ఆగస్టు 25(మన విశ్వం) :** కాగజ్‌నగర్ సిర్పూర్ పేపర్ మిల్ (శ్రావీ) కార్మిక సంఘాల ఫోరం ప్రతినిధులు ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా శాసనమండలి సభ్యులు ఎమ్మెల్సీ దండే విఠల్, కొముురం భీం ఆసిఫాబాద్ జిల్లా కాంగ్రెస్ కమిటీ డీసీసీ అధ్యక్షురాలు ఆత్రం సుగుణక్కలను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కార్మికులు ఎదుర్కొంటున్న పలు సమస్యలను ఫోరం ప్రతినిధులు నాయకుల దృష్టికి తీసుకెళ్లారు. కార్మిక సమస్యల పరిష్కారం, రాబోయే ఎన్నికలు, కార్మికులకు సంబంధించిన వేతన ఒప్పందం తదితర అంశాలపై చర్చించారు. ఈ మేరకు వినతిపత్రం అందజేసి సమస్యల వివరాలను వెల్లడించారు. కార్మికుల హక్కుల పరిరక్షణకు, పెండింగ్‌లో ఉన్న సమస్యల పరిష్కారానికి, న్యాయమైన వేతన ఒప్పందం అమలుకు తమ వంతు సహాయ సహకారాలు అందిస్తామని ఎమ్మెల్సీ దండే విఠల్, డీసీసీ అధ్యక్షురాలు ఆత్రం సుగుణక్క హామీ ఇచ్చారు. కార్మికుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి వెళ్ళమని అతి త్వరలో పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో శ్రావీ కార్మిక సంఘాల ఫోరం ప్రతినిధులు, కార్మిక నాయకులు, తదితరులు

# ఖమ్మంలో జనసేన డిజిటల్ మీడియా సమ్మేళనం

**- సోషల్ మీడియా కార్యకర్తల సమావేశం ఘనంగా నిర్వహణ**
**- 10 నియోజకవర్గాల పోస్టర్ల ఆవిష్కరణ**
**- పార్టీ బలోపేతంపై నేతల దిశానిర్దేశం**
**- పెద్ద సంఖ్యలో పాల్గొన్న కార్యకర్తలు**

**ఖమ్మం, ఆగస్టు 25 (మన విశ్వం):** ఉమ్మడి ఖమ్మం జిల్లా జనసేన పార్టీ డిజిటల్ మీడియా సమ్మేళనం ఘనంగా నిర్వహించబడింది. పార్టీ రాష్ట్ర నాయకులు, అధికార ప్రతినిధి డాక్టర్ గడల శ్రీనివాస్ అధ్యక్షతన, జనసేన నాయకుడు సాయి ఈశ్వర్ రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి జనసేన పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామ్ తాళ్లూరి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని 10 అసెంబ్లీ నియోజకవర్గాలకు సంబంధించిన జనసేన సోషల్ మీడియా పోస్టర్లను రామ్ తాళ్లూరి ఆవిష్కరించారు. పార్టీ సిద్ధాంతాలు, కార్యక్రమాలు ప్రజల్లోకి మరింత విస్తృతంగా



తీసుకెళ్లడంలో సోషల్ మీడియా కీలక పాత్ర పోషించాలని నాయకులు పేర్కొన్నారు. సమావేశంలో సోషల్ మీడియా కార్యకర్తలు, ముఖ్య నాయ కులతో ప్రత్యేకంగా చర్చలు నిర్వహించారు. డిజిటల్ వేదికలను సమర్థవంతంగా వినియోగిస్తూ పార్టీ కార్యక్రమాలను ప్రజలకు చేరవేయాలని, క్షేత్రస్థాయి అంశాలను వేగంగా ప్రచారం చేయాలని సూచించారు. కార్యక్రమంలో డాక్టర్ గడల శ్రీనివాస్ మాట్లాడుతూ, పార్టీ బలోపేతానికి కార్యకర్తల కృషి ఎంతో అవసరమన్నారు. సోషల్ మీడియా ద్వారా ప్రజా సమ స్యలను వెలుగులోకి తీసుకురావడంతో పాటు పార్టీ విధానాలను సమర్థవంతంగా ప్రజలకు వివరించాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో రాష్ట్ర ప్రచార కార్యదర్శి, సినీ నటుడు తనీష్ అల్లాడి, పార్టీ మీడియా కోఆర్డినేటర్ దుంపటి శ్రీనివాస్ రావు, రాష్ట్ర అధికార ప్రతినిధి మిరియాల రామకృష్ణతో పాటు పలువురు రాష్ట్ర, జిల్లా స్థాయి నాయకులు పాల్గొన్నారు. పార్టీ విస్తరణ, భవిష్యత్ కార్యాచరణపై చర్చించారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాకు చెందిన వివిధ నియోజకవర్గాల నాయకులు, సోషల్ మీడియా ప్రతినిధులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. రానున్న రోజుల్లో పార్టీ కార్యక్రమాలను మరింత విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు సమన్వయంతో పనిచేయాలని నాయకులు పిలుపునిచ్చారు.

## బురద రోడ్డుపై వరి నాట్లు వేసి వినూత్నంగా నిరసన



**కొమరం భీం, ఆగస్టు 25(మన విశ్వం) :** దహేగం మండలం లోని గిరవెల్లి--గెర్రె గ్రామాల మధ్య అధ్వాన్నంగా మారిన రహదారిపై బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు బురదలో వరి నాట్లు వేసి వినూత్నంగా నిరసన తెలిపారు. రహదారి మొత్తం బురదమయమై రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని స్థానికులు, బిఆర్ఎస్ కార్యకర్తలు ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప అటవీ శాఖ అనుమతుల కోసం తీవ్రంగా ప్రయత్నించారని నాయకులు గుర్తుచేశారు. అధికారంలోకి రాగానే కేంద్రంతో మాట్లాడి అనుమతులు తెచ్చి రోడ్డు వేయిస్తానని హామీ ఇచ్చిన ఎమ్మెల్యే పాల్వాయి హరీష్ బాబు, అధికారంలోకి వచ్చి మూడేళ్లవుతున్నా ఎందుకు పట్టించుకోవడం లేదని ప్రశ్నించారు. గతంలో బురద రోడ్లపై నిరసనలు తెలిపిన ఆయన, ఇప్పుడు స్పందించకపోవడం దారుణమని మండి పడ్డారు. ప్రజల సమస్యలను గుర్తించి వెం టనే అటవీ అనుమతులు సాధించి రోడ్డు నిర్మించా లని బిఆర్ఎస్ కార్యకర్తలు డిమాండ్ చేశారు.

# వన మహోత్సవంలో మొక్కలు నాటిన అధికారులు

**- అటవీ శాఖ కార్యాలయంలో కార్యక్రమం**
**- 'మన మొక్కలు--మన భవిష్యత్' నినాదంతో నిర్వహణ**
**- పచ్చదనం పెంపుపై అధికారుల పిలుపు**
**- ప్రజల భాగస్వామ్యంతో లక్ష్యాల సాధనకు కృషి**

**కొముురం భీం , ఆగస్టు 25 (మన విశ్వం ):** వన మహోత్సవం--2026 కార్యక్రమంలో భాగంగా జిల్లా అటవీ శాఖ ఆధ్వర్యంలో ఆసిఫాబాద్ అటవీ శాఖ కార్యాలయంలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. 'మన మొక్కలు--మన భవిష్యత్', 'మొక్కలు నాటుదాం--ప్రతి వర్షపు చుక్కను ఒడిసిపట్టుదాం' అనే నినాదాలతో నిర్వహించిన ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్, జిల్లా అటవీ శాఖ అధికారి, అదనపు కలెక్టర్‌తో పాటు పలువురు అటవీ శాఖ అధికారులు పాల్గొన్నారు. కార్యక్రమంలో భాగంగా అధికారులు మొక్కలు నాటి పచ్చదనం పెంపుపై అవగాహన కల్పించారు. పర్యావరణ పరిరక్షణకు మొక్కల పెంపకం అత్యంత



అవసరమని పేర్కొంటూ ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని పిలుపునిచ్చారు. వర్షపు నీటి సంరక్షణ, భూగర్భ జలాల పరిరక్షణ, పర్యావరణ సమతుల్యత సాధనలో వృక్షాల పాత్ర ఎంతో కీలకమని అధికారులు వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న హరిత కార్యక్రమాలను ప్రజలు విజయవంతం చేయాలని కోరారు. పట్టణాలు, గ్రామాల్లో ఖాళీ ప్రదేశాలు, ప్రభుత్వ కార్యాలయాలు, విద్యాసంస్థలు, రహదారుల వెంట విస్తృతంగా మొక్కలు నాటాలని సూచించారు. మొక్కలను నాటడమే కాకుండా వాటి సంరక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని తెలిపారు. వన మహోత్సవం లక్ష్యాలను ప్రజల భాగస్వామ్యంతో పూర్తి చేయడం ద్వారా జిల్లాలో పచ్చదనం మరింత పెరుగుతుందని అధికారులు ఆశాభావం వ్యక్తం చేశారు. భవిష్యత్ తరాలకు ఆరోగ్యకరమైన వాతావరణాన్ని అందించేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో అటవీ శాఖ అధికారులు, సిబ్బంది, ఇతర ప్రభుత్వ శాఖల ప్రతినిధులు పాల్గొన్నారు. పర్యావరణ పరిరక్షణ కోసం సమిష్టి కృషి అవసరమని, ప్రతి మొక్కను సంరక్షించడం ద్వారా వన మహోత్సవం విజయవంతమవుతుందని అధికారులు తెలిపారు.

## కాగజ్‌నగర్ ఫ్లైఓవర్‌పై ఘనంగా మొక్కలు నాటే కార్యక్రమం

**- పట్టణాన్ని పచ్చదనంతో తీర్చిదిద్దడమే లక్ష్యం:మున్సిపల్ చైర్ పర్సన్ షాహిన్ సుల్తానా**



**కొమరం భీం/ కాగజ్‌నగర్, ఆగస్టు 25(మన విశ్వం):** వనమహోత్సవం కార్యక్రమంలో భాగంగా కాగజ్‌నగర్ పట్టణాన్ని పచ్చదనంతో, మరింత సుందరంగా తీర్చిదిద్దేందుకు మున్సిపాలిటీ ఆధ్వర్యంలో ఫ్లైఓవర్ బ్రిడ్జిపై ఏర్పాటు చేసిన కుండీలలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ?మున్సిపల్ చైర్‌పర్సన్ షాహిన్ సుల్తానా అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో కమిషనర్ బట్టు తిరుపతి, కౌన్సిలర్లు మరియు మున్సిపల్ సిబ్బంది పాల్గొని మొక్కలు నాటారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ మాట్లాడుతూ, పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ బాధ్యతగా మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని పిలుపునిచ్చారు. ఫ్లైఓవర్‌పై పచ్చదనం పెంచడం ద్వారా పట్టణ సౌందర్యం మరింత ఇనుమడిస్తుందని పేర్కొన్నారు. నాటిన మొక్కల సంరక్షణకు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సిబ్బందికి సూచిస్తూ, వనమహోత్సవ స్ఫూర్తితో పట్టణ ప్రజలందరూ భాగస్వాములు కావాలని కోరారు..

# పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి

**- జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు**

**ములుగు ప్రతినిధి, ఆగస్టు25(మన విశ్వం) :**ములుగు జిల్లా కేంద్రంలో వన మహోత్సవం సందర్భంగా మంగళవారం గట్టమ్మ సమీపంలోని పంచాయతీరాజ్ పైలాన్ ఆవరణలో జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు, జిల్లా ఎస్పీ సుధీర్ రామ్నాథ్ కేకన్, ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి లెనిన్ వత్సల్ టోప్పో, జిల్లా అటవీ అధికారి వికాస్ మీనాతో కలిసి మొక్కలు నాటారు.
ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణలో మొక్కలు, అడవులు అత్యంత కీలక పాత్ర పోషిస్తాయని పేర్కొన్నారు. పెరుగుతున్న కాలుష్యాన్ని నియంత్రించడంతోపాటు



వాతావరణ సమతుల్యతను కాపాడేందుకు పచ్చదనాన్ని విస్తరించాల్సిన అవసరం ఉందన్నారు. వన మహోత్సవాన్ని కేవలం మొక్కలు నాటే కార్యక్రమంగా కాకుండా, ప్రకృతిని పరిరక్షించే సామాజిక బాధ్యతగా ప్రతి ఒక్కరూ భావించాలని సూచించారు. భావితరాలకు స్వచ్ఛమైన గాలి, ఆరోగ్యకరమైన వాతావరణాన్ని అందించాలంటే ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి, అవి వృక్షాలుగా ఎదిగే వరకు సంరక్షించాలని పిలుపునిచ్చారు. నాటిన ప్రతి మొక్కను కాపాడినప్పుడే వన మహోత్సవ లక్ష్యం నెరవేరుతుందని, పచ్చదనాన్ని పెంపొందించడం ద్వారా ఆరోగ్యకరమైన భవిష్యత్తుకు బాటలు వేయవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో ములుగు ఎఫ్‌డీఓ సత్తయ్య, జాకారం సర్పంచ్, అటవీ శాఖ అధికారులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# రంగయ్యచెరువులోకి దేవాదుల నీటిని వెంటనే విడుదల చేయాలి

**- వర్షాలు లేక ఎండిపోతున్న పంటలను కాపాడాలి: బీజేపీ కిసాన్ మోర్చా**

**వరంగల్ /నల్లబెల్లి,ఆగస్టు, 25(మన విశ్వం):** వర్షాలు సకాలంలో కురవక పంటలు ఎండిపోతున్న నేపథ్యంలో రైతులను ఆదుకునేందుకు దేవాదుల ప్రాజెక్టు నుంచి రంగయ్య చెరువులోకి వెంటనే నీటిని విడుదల చేయాలని బీజేపీ కిసాన్ మోర్చా వరంగల్ జిల్లా ఉపాధ్యక్షులు బచ్చు వెంకటేశ్వర్ రావు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రస్తుతం వర్షాలు లేకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, సాగు చేసిన పంటలకు సరిపడా నీరు అందక అవి ఎండిపోయే పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం



చేశారు. రైతులు ఎంతో కష్టపడి పెట్టుబడులు పెట్టి సాగు చేసిన పంటలను కాపాడేందుకు ప్రభుత్వం తక్షణ చర్యలు చేపట్టాలని కోరారు. దేవాదుల ప్రాజెక్టు నుంచి రంగయ్యచెరువులోకి నీటిని విడుదల చేస్తే చెరువు పరిధిలోని రైతులకు ఎంతో ప్రయోజనం కలుగుతుందని, పంటలకు అవసరమైన సాగునీరు అందుతుందని తెలిపారు. రైతుల కష్టాలను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం, సంబంధిత అధికారులు వెంటనే స్పందించి దేవాదుల ప్రాజెక్టు నుంచి రంగయ్యచెరువులోకి నీటిని విడుదల చేయాలని డిమాండ్ చేశారు. రైతుల పక్షాన బీజేపీ కిసాన్ మోర్చా నిరంతరం పోరాటం చేస్తుందని, ప్రభుత్వం స్పందించే వరకు రైతుల సమస్యను ప్రజల్లోకి తీసుకెళ్తామని బచ్చు వెంకటేశ్వర్ రావు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకులు తడుక అశోక్ గౌడ్, మండల కోశాధికారి మనోహర్, పెరుమాండ్ల కోటి, రమేశ్, సుదర్శన్, నాగేలి ప్రకాష్, కొండ్లే రమేష్, బీజేవైఎం నాయకులు సుధగని ప్రమోద్ గౌడ్, కడియాల విజయ్ తదితరులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## పేకాట స్థావరంపై పోలీసుల దాడి: ఐదుగురు అరెస్ట్



**కొమరం భీం,ఆగస్టు(మన విశ్వం):**కాగజ్‌నగర్ పట్టణంలోని బాలాజీ నగర్, ఆదర్శ నగర్ సమీపంలోని సబ్‌స్టేషన్ వద్ద పేకాట ఆడుతున్న స్థావరంపై పోలీసులు ఆకస్మిక దాడి నిర్వహించారు. ఈ దాడిలో పేకాట ఆడుతున్న ఐదు గురు వ్యక్తులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం. పక్కా సమాచారంతో దాడి చేసిన పోలీసులు నిందితుల వద్ద నుంచి రూ. 18,500 నగదు, 4 మొబైల్ ఫోన్లు, మరియు 52 పేకాట కార్డు లను స్వాధీనం చేసుకున్నారు. ఖాజా సలీం, జహీర్ పాషా,నహీద్ అహ్మద్, అమ్జద్ ఖాన్, నిసార్ బేగ్, నిందితులపై కేసు నమోదు చేసి తదుపరి దర్యాప్తు జరుపుతున్నట్లు పోలీసులు తెలిపారు.

# సీఐ శంకర్‌రావును సన్మానించిన కాంగ్రెస్ పార్టీ నాయకులు

**నల్లబెల్లి, ఆగస్టు 25(మన విశ్వం) :** దుగ్గొండి సర్కిల్ నూతన సీఐగా బాధ్యతలు స్వీకరించిన శంకర్‌రావును కాంగ్రెస్ పార్టీ నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి పోలీస్‌స్టేషన్‌లో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ ఎర్రబెల్లి రఘుపతిరావు, నల్లబెల్లి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మాలోత్ చరణ్‌సింగ్ పాల్గొన్నారు.
ఈ సందర్భంగా నర్సంపేట బ్లాక్ కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ సిద్దూరి తిరుపతిరావు, నల్లబెల్లి మండల కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ వైనాల అశోక్, పీఏసీఎస్ డైరెక్టర్ చార్ల శివారెడ్డి, మండల కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి మాలోత్ మోహన్, సర్పంచుల ఫోరం అధ్యక్షుడు ఇస్తార్ శేఖర్, నందిగామ సర్పంచ్




భూక్య భాస్కర్, రామతీర్థం సర్పంచ్ పొదిళ్ల వసంత శోభన్, నందిగామ గ్రామ పార్టీ అధ్యక్షుడు జంగిలి మోహన్, నల్లబెల్లి మండల సోషల్ మీడియా ఇన్‌చార్జ్ గద్దల సురేష్, కాంగ్రెస్ పార్టీ నాయకులు కుంచల రాజు, వైనాల పవన్ తదితరులు పాల్గొన్నారు. నూతన సీఐగా బాధ్యతలు స్వీకరించిన శంకర్‌రావుకు నాయకులు శుభాకాంక్షలు తెలిపారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేయాలని ఆకాంక్షించారు.


బుధవారం, ఆగస్టు 26, 2026

మన విశ్వం
VOICE OF THE PEOPLE-POWER OF TRUTH
తెలుగు వార్తా దినపత్రిక



# అక్రమాల అడ్డుకట్టకే స్మార్ట్ రేషన్ కార్డులు : మంత్రి

- గొల్లపల్లిలో కార్డుల పంపిణీ కార్యక్రమం
- క్యూఆర్ కోడ్‌తో పారదర్శక వ్యవస్థ
- అర్హుల కార్డులు రద్దు కావని స్పష్టీకరణ
- పింఛన్లు, ఇందిరమ్మ ఇళ్లపై మంత్రి ప్రకటన




**జగిత్యాల, ఆగస్టు 25 (మన విశ్వం):** ప్రజా పంపిణీ వ్యవస్థలో అక్రమాలకు అడ్డుకట్ట వేయడం, పారదర్శకత పెంచడమే డిజిటల్ స్మార్ట్ రేషన్ కార్డుల ప్రధాన లక్ష్యమని పౌర సరఫరాల శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ తెలిపారు. జగిత్యాల జిల్లా గొల్లపల్లిలో నిర్వహించిన కార్యక్రమంలో లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ధర్మపురి నియోజకవర్గంలో మొత్తం 80,873 స్మార్ట్ రేషన్ కార్డులు జారీ చేస్తున్నట్లు తెలిపారు. గొల్లపల్లి మండల పరిధిలోని 34 రేషన్ దుకాణాల ద్వారా 15,185 కుటుంబాలకు ఈ కార్డులు అందజేయనున్నట్లు వివరించారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు ప్రభుత్వం సాంకేతికతను వినియోగిస్తోందన్నారు. స్మార్ట్ కార్డుల్లో క్యూఆర్ కోడ్ సదుపాయం కల్పించడం ద్వారా లబ్ధిదారుల వివరాలు పారదర్శకంగా అందుబాటులో ఉంటాయని చెప్పారు. రాష్ట్రంలోని ఏ ప్రాంతంలో ఉన్నా రేషన్ సరుకులు పొందే పోర్టబిలిటీ సదుపాయం అందుబాటులో ఉంటుందని, సన్న బియ్యం పంపిణీ కూడా కొనసాగుతోందని పేర్కొన్నారు.

అర్హులైన ఏ ఒక్కరి రేషన్ కార్డును కూడా రద్దు చేయబోమని మంత్రి స్పష్టం చేశారు. అర్హత కలిగిన కొత్త కుటుంబాలకు రేషన్ కార్డుల జారీ ప్రక్రియ నిరంతరం కొనసాగుతుందని తెలిపారు. అర్హులందరికీ సంక్షేమ పథకాల ప్రయోజనాలు చేరేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద లబ్ధిదారుల ఖాతాల్లో రూ.5 లక్షల ఆర్థిక సహాయం జమ చేస్తున్నట్లు తెలిపారు. త్వరలో రెండో విడత నిధుల విడుదల కూడా చేపడతామని చెప్పారు. గృహ నిర్మాణ పనులను వేగవంతం చేయాలని లబ్ధిదారులకు సూచించారు. వితంతువులు, దివ్యాంగులకు కొత్త పింఛన్లు మంజూరు చేసే ప్రక్రియ కొనసాగుతోందని మంత్రి వెల్లడించారు. సంక్షేమ పథకాల అమలులో పారదర్శకత, అర్హులకు ప్రయోజనాల అందజేతకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇస్తోందని పేర్కొన్నారు. కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతి నిధులు, అధికారులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

# గ్రామస్థాయి నుంచి కాంగ్రెస్‌ను బలోపేతం చేయాలి: డీసీసీ అధ్యక్షురాలు ఆత్రం సుగుణక్క, ఎమ్మెల్సీ దండే విఠల్



**కొమురం భీం, ఆగస్టు 25(మన విశ్వం):** ఆసిఫాబాద్ జిల్లా బెజ్జూర్ మండలంలో కాంగ్రెస్ పార్టీని గ్రామ, బూత్ స్థాయిల నుంచి మరింత పటిష్టం చేయాలని డీసీసీ అధ్యక్షురాలు ఆత్రం సుగుణక్క, ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఎమ్మెల్సీ దండే విఠల్ పిలుపునిచ్చారు. మంగళవారం మండల అధ్యక్షురాలు పంద్రం పుష్పలత అధ్యక్షతన నిర్వహించిన సంఘటన్ సృజన్ అభియాన్ మండల సర్వసభ్య సమావేశానికి వారు ముఖ్య అతిథులుగా హాజరై మాట్లాడారు. పార్టీ కోసం నిరంతరం శ్రమిస్తున్న కార్యకర్తలకు తగిన గుర్తింపు కల్పించడమే ఈ అభియాన్ ముఖ్య ఉద్దేశమని వారు స్పష్టం చేశారు. నాయకులు, కార్యకర్తలు ఐక్యంగా ఉంటూ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని, స్థానిక సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, సర్పంచులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# రూ.1.25 కోట్ల గంజాయి స్వాధీనం

- అంతర్‌రాష్ట్ర స్మగ్లర్ అరెస్టు
- 251 కిలోల గంజాయి పట్టుకున్న పోలీసులు
- నాలుగు రాష్ట్రాలకు సరఫరా చేసినట్లు వెల్లడి
- మత్తు పదార్థాలపై ఉక్కుపాదం మోపిన పోలీసులు




**హన్మకొండ , ఆగస్టు 25 (మన విశ్వం):** వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో దామెర పోలీసులు భారీ గంజాయి రవాణా ముఠాను ఛేదించారు. అంతర్‌రాష్ట్ర గంజాయి స్మగ్లింగ్‌కు పాల్పడుతున్న ఓ నిందితుడిని అరెస్టు చేసి, అతని వద్ద నుంచి సుమారు రూ.1.25 కోట్ల విలువైన 251 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. అలాగే ఒక ద్విచక్ర వాహనం, రూ.9,000 నగదు, ఒక సెల్‌ఫోన్‌ను కూడా పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈస్ట్ జోన్ డీసీపీ అంకిత్ కుమార్ పర్యవేక్షణలో దామెర పోలీసులు చేపట్టిన ప్రత్యేక ఆపరేషన్‌లో ముదిగొండ నాగేశ్వర్ రావు (55), పులుకుర్తి గ్రామం, దామెర మండలానికి చెందిన వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు. విచారణలో అతడు అంతర్‌రాష్ట్ర స్థాయిలో గంజాయి కొనుగోలు, విక్రయాలకు పాల్పడుతున్నట్లు కీలక వివరాలు బయటపడ్డాయి. ప్రాథమిక విచారణలో ఒడిశా రాష్ట్రానికి చెందిన వ్యక్తుల నుంచి తక్కువ ధరకు గంజాయి కొనుగోలు చేసి, తెలంగాణ, మహారాష్ట్ర, కర్ణాటక, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలకు చెందిన పలువురు వ్యక్తుల ద్వారా అధిక ధరలకు విక్రయిస్తున్నట్లు నిందితుడు అంగీకరించినట్లు పోలీసులు తెలిపారు. సులభంగా డబ్బు సంపాదించాలనే ఉద్దేశంతో ఈ అక్రమ వ్యాపారాన్ని కొనసాగించినట్లు వెల్లడైంది. నిందితుడు ఇచ్చిన సమాచారం ఆధారంగా అతని నివాసంలో సోదాలు నిర్వహించిన పోలీసులు 251 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. స్వాధీనం చేసుకున్న మత్తు పదార్థాల మార్కెట్ విలువ సుమారు రూ.1.25 కోట్లుగా అంచనా వేశారు. ఈ కేసు రాష్ట్రాల మధ్య విస్తరించిన అక్రమ మత్తు పదార్థాల నెట్‌వర్క్‌ను వెలుగులోకి తెచ్చిందని అధికారులు తెలిపారు. ఈ వ్యవహారంలో సంబంధం ఉన్న ఇతర నిందితులను పట్టుకునేందుకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసినట్లు పోలీసులు వెల్లడించారు. గంజాయి కొనుగోలు చేసినట్లు గుర్తించిన ఇతర రాష్ట్రాల వ్యక్తుల వివరాలను సేకరిస్తూ దర్యాప్తును మరింత విస్తరించారు. మత్తు పదార్థాల అక్రమ రవాణా, వినియోగంపై తెలంగాణ పోలీసులు అత్యంత కఠినంగా వ్యవహరిస్తున్నారని వరంగల్ పోలీస్ కమిషనర్ శ్వేత తెలిపారు. యువత మత్తు పదార్థాల బారిన పడకుండా కాపాడటం పోలీస్ శాఖ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. గంజాయి విక్రయాలు లేదా వినియోగంపై సమాచారం తెలిసిన ప్రజలు వెంటనే పోలీసులకు తెలియజేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కేసును ఛేదించడంలో ప్రతిభ కనబరిచిన పోలీసు అధికారులను కమిషనర్ అభినందించారు.

# 'మన విశ్వం' కథనానికి బీజేపీ మద్దతు

- కాంగ్రెస్ ప్రభుత్వం, ఏఎంఆర్ యాజమాన్యంపై బీజేపీ మండల అధ్యక్షుడు బండ శ్రీకాంత్ నిప్పులు



**మల్హర్, ఆగస్టు 25(మన విశ్వం):** మల్హర్ మండలంలో ప్రధాన రహదారుల దుస్థితి, ఏఎంఆర్ కంపెనీ అడ్డగోలు దోపిడీపై 'మన విశ్వం' దినపత్రికలో ప్రచురితమైన కథనంపై బీజేపీ మల్హర్ మండల అధ్యక్షుడు బండ శ్రీకాంత్ తీవ్రంగా స్పందించారు. ప్రజలు, రోగులు పడుతున్న నరకయాతనను కళ్లకు కట్టినట్లు వెలుగులోకి తెచ్చిన 'మన విశ్వం' పత్రికను ఆయన అభినందిస్తూ, కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరిపై, ఏఎంఆర్ సంస్థ మొండి వైఖరిపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు.

**- కలెక్టర్ ఆదేశాలకే దిక్కులేదా?**

ఏఎంఆర్ భారీ వాహనాల వల్ల ధ్వంసమైన రోడ్లను ఆ సంస్థ సీఎస్సార్ నిధులతోనే బాగు చేయాలని జిల్లా కలెక్టర్ ఆదేశించినా యాజమాన్యం బేఖాతరు చేయడం సిగ్గుచేటని మండిపడ్డారు. కలెక్టర్ ఆదేశాలకే విలువ లేకపోతే ఇక సామాన్య ప్రజల పరిస్థితి ఏమిటని ప్రశ్నించారు. తాడిచర్ల ప్రభుత్వ ఆసుపత్రి సమీపంలోని మూలమలుపు తీవ్రంగా దెబ్బతిని అత్యంత ప్రమాదకరంగా మారిందని, అత్యవసర వైద్యం కోసం వచ్చే గర్భిణులు, రోగులు ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని ప్రయాణించాల్సిన దుస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రమాదం జరిగి ప్రాణాలు పోయాకే ప్రభుత్వం స్పందిస్తుందా అని నిలదీశారు. తాడిచర్ల నుంచి ఖమ్మంపల్లి మీదుగా మంథని వెళ్లే కీలకమైన రహదారి దాదాపు మూడేళ్లుగా ఛిద్రమై ఉన్నా స్థానిక కాంగ్రెస్ ప్రజాప్రతి నిధులు పట్టించుకోకపోవడం దారుణమన్నారు.? దుబ్బగట్టు ప్రధాన రహదారిపై వర్షం పడితే నీరు నిలిచి రోడ్డేదో, గుంత ఏదో తెలియక ద్విచక్ర వాహనదారులు, పాఠశాల విద్యార్థులు రోజూ ప్రమాదాల బారిన పడుతున్నారని తెలిపారు. ఏఎంఆర్ కంపెనీ కోట్ల రూపాయల వ్యాపారం చేస్తూ ప్రజా రహదారులను ధ్వంసం చేస్తోందని, కానీ గ్రామాలకు కేటాయించాల్సిన సిఎస్ఆర్ నిధులు ఏమవుతున్నాయో శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. అధికారులతో కుమ్మక్కై నిధులు దారిమళ్లిస్తున్నారని ఆరోపించారు.?ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతుంటే అధికార కాంగ్రెస్ పార్టీ నాయకులు, అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని ధ్వజమెత్తారు. తక్షణమే ఏఎంఆర్ యాజమాన్యం స్పందించి సిఎస్ఆర్ నిధులతో తాడచర్ల-ఖమ్మంపల్లి, ఆసుపత్రి మలుపు, దబ్బగట్టు రోడ్ల,తాడిచెర్ల నుండి నాగులమ్మ మరమ్మతులు, బీటీ నిర్మాణ పనులు చేపట్టాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ప్రజలను, బాధిత గ్రామస్తులను ఏకం చేసి ఏఎంఆర్ వాహనాలను అడ్డుకుంటామని, కాంగ్రెస్ ప్రజాప్రతినిధుల కార్యాలయాలను ముట్టడిస్తామని హెచ్చరించారు.

# గిరిజన ఫిర్యాదులపై సమగ్ర విచారణ

- జాతీయ షెడ్యూల్డ్ తెగల కమిషన్ సభ్యుడి సమీక్ష
- 40 కేసులపై అధికారులతో విచారణ
- అర్హులకు న్యాయం చేయాలని ఆదేశం
- కేసుల పరిష్కారంలో జాప్యం వద్దని సూచన



**భద్రాద్రి కొత్తగూడెం, ఆగస్టు 25 (మన విశ్వం):** జాతీయ షెడ్యూల్డ్ తెగల కమిషన్ సభ్యుడు జాటోత్ హుస్సేన్ మంగళవారం ఐడీఓసీ కార్యాలయంలో షెడ్యూల్డ్ తెగలకు సంబంధించిన ఫిర్యాదులు, కేసులపై సమగ్ర విచారణ నిర్వహించారు. కమిషన్‌కు అందిన వివిధ ఫిర్యాదులను పరిశీలిస్తూ సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మొత్తం 40 కేసులను విచారణకు స్వీకరించిన కమిషన్ సభ్యుడు, ఫిర్యాదుదారులు మరియు సంబంధిత శాఖల అధికారుల నుంచి వివరాలు సేకరించారు. కేసులకు సంబంధించిన రికార్డులు, నివేదికలను పరిశీలించి ఇప్పటివరకు తీసుకున్న చర్యలపై అధికారులను ప్రశ్నించారు.

షెడ్యూల్డ్ తెగలకు సంబంధించిన సమస్యలను నిబంధనల ప్రకారం పరిష్కరించాలని జాటోత్ హుస్సేన్ సూచించారు. అర్హులైన గిరిజనులకు న్యాయం జరిగేలా అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని, పెండింగ్ అంశాల పరిష్కారానికి ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. కేసుల పరిష్కారంలో అనవసర జాప్యం చోటుచేసుకోకుండా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. గిరిజనుల భూహక్కులు, సంక్షేమ పథకాలు, సామాజిక రక్షణకు సంబంధించిన అంశాలపై ప్రత్యేక శ్రద్ధ అవసరమని పేర్కొన్నారు.గిరిజనుల సంక్షేమం, అభివృద్ధికి సంబంధించిన ఫిర్యాదులను సకాలంలో పరిష్కరించడం ప్రభుత్వ యంత్రాంగం బాధ్యత అని ఆయన తెలిపారు. ప్రజలకు అందుబాటులో ఉండి వారి సమస్యలను వేగంగా పరిష్కరించేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ అంకిత్, జిల్లా ఎస్పీ రోహిత్ రాజు, అదనపు కలెక్టర్ వేణుగోపాల్, ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి రాహుల్, భద్రాచలం ఉప కలెక్టర్ మృణాల్ శ్రేష్టతో పాటు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు. గిరిజనుల హక్కుల పరిరక్షణ, సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని అధికారులు పేర్కొన్నారు.

# మొక్కలతో పచ్చని తెలంగాణ నిర్మాణం

- ప్రత్యేక వనమహోత్సవంలో మొక్కలు నాటిన మంత్రి
- పర్యావరణ పరిరక్షణకు ప్రజల భాగస్వామ్యం అవసరం
- భవిష్యత్ తరాలకు స్వచ్ఛమైన వాతావరణం లక్ష్యం
- మొక్కల సంరక్షణపై అవగాహన కల్పింపు



**వరంగల్, ఆగస్టు 25 (మన విశ్వం):** ప్రతి ఒక్కరూ కనీసం ఒక్క మొక్క నాటి పచ్చని తెలంగాణ నిర్మాణానికి తమ వంతు కృషి చేయాలని రాష్ట్ర మంత్రి కొండా సురేఖ పిలుపునిచ్చారు. వరంగల్ జిల్లా ఖిలా వరంగల్ పరిధిలోని రంగశాయిపేట ప్రభుత్వ జూనియర్, డిగ్రీ కళాశాలలో నిర్వహించిన ప్రత్యేక వనమహోత్సవ కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని మొక్కలు నాటారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ, పచ్చదనం పెంపు ప్రతి పౌరుడి బాధ్యత అని అన్నారు. పెరుగుతున్న కాలుష్యం, వాతావరణ మార్పుల ప్రభావాన్ని తగ్గించాలంటే విస్తృతంగా మొక్కలు నాటాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు.

మొక్కలు నాటడం మాత్రమే కాకుండా వాటి సంరక్షణకు కూడా సమాన ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. నాటిన ప్రతి మొక్కను పెంచి పెద్ద చెట్టుగా తీర్చిదిద్దినప్పుడే వనమహోత్సవం లక్ష్యం నెరవేరుతుందని అన్నారు. పచ్చదనం పెరగడం ద్వారా వాతావరణ సమతుల్యత కాపాడటంతో పాటు ప్రజారోగ్యానికి కూడా మేలు జరుగుతుందని తెలిపారు. విద్యార్థులు, యువత మొక్కల పెంపకంలో చురుకుగా పాల్గొని సమాజానికి ఆదర్శంగా నిలవాలని కోరారు. భవిష్యత్ తరాలకు స్వచ్ఛమైన, ఆరోగ్యకరమైన వాతావరణాన్ని అందించేందుకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటే ఉద్యమంలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. పర్యావరణ పరిరక్షణను సామాజిక బాధ్యతగా స్వీకరించాలని సూచించారు. వనమహోత్సవ కార్యక్రమంలో కళాశాల విద్యార్థులు, అధ్యాపకులు, అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. పచ్చని తెలంగాణ లక్ష్య సాధనకు ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలకు ప్రజలు సహకరించాలని మంత్రి కోరారు.

# ప్రభుత్వ ఆసుపత్రుల్లో మెరుగైన వైద్య సేవలు అందించాలి

- మౌలిక వసతుల కల్పనకు కలెక్టర్ ఆదేశాలు
- వైద్య పరికరాలు, సిబ్బంది అందుబాటుపై సమీక్ష
- ఆసుపత్రుల్లో బయోమెట్రిక్ హాజరు తప్పనిసరి
- కొత్త పింఛన్లకు అర్హుల వివరాలు పంపాలని సూచన



**ఖమ్మం, ఆగస్టు 25 (మన విశ్వం):** జిల్లాలోని ప్రభుత్వ ఆసుపత్రులు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందేలా అవసరమైన మౌలిక వసతులు, వైద్య పరికరాలు, సిబ్బంది అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్ అధికారులను ఆదేశించారు. ఖమ్మం కలెక్టరేట్ సమావేశ మందిరంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ పి. శ్రీజతో కలిసి వైద్య ఆరోగ్య శాఖ, ఇంజినీరింగ్ శాఖ అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన పలు కీలక సూచనలు చేశారు. ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించేందుకు అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో అవసరమైన సౌకర్యాలు కల్పించాలని కలెక్టర్ తెలిపారు. ప్రస్తుతం చేపడుతున్న సివిల్ పనులు భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా ఉండేలా ప్రణాళికలు రూపొందించాలని సూచించారు. ప్రతి ఆరోగ్య కేంద్రంలో అత్యవసరంగా అవసరమైన పనులను గుర్తించి ప్రాధాన్యతా క్రమంలో పూర్తి చేయాలని ఆదేశించారు.

ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో చేపట్టాల్సిన సివిల్ పనులకు సుమారు రూ.5.20 కోట్ల అంచనాలతో ప్రతిపాదనలు సిద్ధం చేసినందున వాటి అమలును వేగవంతం చేయాలని సూచించారు. అవసరం లేని పనులకు ప్రభుత్వ నిధులను ఖర్చు చేయవద్దని, ప్రజలకు ప్రత్యక్ష ప్రయోజనం కలిగించే పనులకే ప్రాధాన్యత ఇవ్వాలని స్పష్టం చేశారు. సత్తుపల్లి, మధిర ఏరియా ఆసుపత్రులకు వైద్య పరికరాల కొనుగోలుకు తొలి విడతగా రూ.30 లక్షల చొప్పున, కల్లూరు సామాజిక ఆరోగ్య కేంద్రానికి రూ.20 లక్షలు మంజూరు చేస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. పరికరాల కొనుగోలులో నాణ్యత, గ్యారెంటీ, నిర్వహణ సేవలను తప్పనిసరిగా పరిగణనలోకి తీసుకోవాలని సూచించారు. కెనరా బ్యాంకు సహకారంతో అందుబాటులోకి రానున్న 10 ఆర్‌వో ప్లాంట్లను అవసరమైన ఆసుపత్రుల్లో ఏర్పాటు చేయాలని తెలిపారు. ఆసుపత్రుల్లో వైద్యులు అందుబాటులో లేరనే ఫిర్యాదులు రాకుండా చూడాలని కలెక్టర్ హెచ్చరించారు. ప్రతి వైద్యుడు సమయానికి విధులకు హాజరై, ప్రత్యామ్నాయ వైద్యుడు బాధ్యతలు స్వీకరించే వరకు విధుల్లో కొనసాగాలని సూచించారు. అవసరం లేని డిప్యూటేషన్లకు తావు ఇవ్వకుండా రోగుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని మాత్రమే నిర్ణయాలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రభుత్వం కొత్తగా మంజూరు చేస్తున్న పింఛన్లకు అర్హులైన వారి వివరాలను వెంటనే పంపించాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఆసుపత్రుల పరిశుభ్రత, సిబ్బంది బయోమెట్రిక్ హాజరు, సమస్యలపై తక్షణ స్పందనకు ప్రాధాన్యత ఇవ్వాలని పేర్కొన్నారు. ప్రతి 15 రోజులకు ఒకసారి ఆసుపత్రుల పరిశుభ్రతపై ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టాలని, ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడమే లక్ష్యంగా అధికారులు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ దివాకర టి.ఎస్ ఆదేశించారు.

# కాంగ్రెస్ సంక్షేమ పథకాలే బలం : సిర్పూర్‌లో విజయం ఖాయం

- డీసీసీ మైనార్టీ విభాగం చైర్మన్ అర్షద్ హుస్సేన్ ధీమా

**కొమరం భీం/?బెజ్జూర్, ఆగస్టు 25 (మన విశ్వం):** రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రజా సంక్షేమ పథకాలే పార్టీకి అసలైన బలమని, రానున్న రోజుల్లో సిర్పూర్ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ ఘన విజయం సాధించడం ఖాయమని కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా డీసీసీ మైనార్టీ విభాగం చైర్మన్ అర్షద్ హుస్సేన్ ధీమా వ్యక్తం చేశారు. ?బెజ్జూర్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న పథకాలతో ప్రజలకు ఎంతో మేలు జరుగుతోందని వివరించారు.

**- సంక్షేమ పథకాలతో ప్రజల్లో సంతృప్తి:**

**- అర్హులైన రైతులకు రుణమాఫీ అమలు.మహిళలకు ఉచిత బస్సు** ప్రయాణం, రూ.500 కే గ్యాస్ సిలిండర్ పంపిణీ. 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ సౌకర్యం.ఇందిరమ్మ ఇళ్లు మరియు రేషన్, నిరుపేదలకు పక్కా ఇళ్లు, నూతన రేషన్ కార్డులు, సన్న బియ్యం పంపిణీ.

గత బీఆర్ఎస్ పాలనలో జరిగిన అన్యాయాలను ప్రజలు గమనించారని, తగిన సమయంలో వారికి గుణపాఠం చెప్పారని పేర్కొన్నారు.

**- 22 జీవోపై అసత్య ప్రచారాలు తగవు:**

మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప 22(ఎ) జీవోపై తప్పుడు ప్రచారం చేస్తూ ప్రజలను అయోమయానికి గురిచేస్తున్నారని అర్షద్ హుస్సేన్ ఆరోపించారు. భూముల రికార్డులను సవరించడం, ప్రభుత్వ భూములను గుర్తించడం మరియు రైతులకు స్పష్టమైన యాజమాన్య హక్కులతో కూడిన పట్టాలు అందించడమే 22(ఎ) ముఖ్య ఉద్దేశమని స్పష్టం చేశారు. ప్రతిపక్షాలు ఇకనైనా ఇలాంటి అసత్య ఆరోపణలు, తప్పుడు ప్రచారాలు మానుకోవాలని ఆయన హితవు పలికారు



# సైబర్ టెర్రరిజం కేసు రామగుండంలో 'ఉగ్ర' లింకుల కలకలం

**పెద్దపల్లి జిల్లా :** రామగుండం పట్టణానికి చెందిన ఓ యువకుడి ఇంట్లో ఎన్ఐఏ సోదాలు చేపట్టి ంది. గుజరాత్‌కు చెందిన ఎన్ఐఏ బృంద ం రామగుండం అయోధ్యనగర్‌లో ఉండే డెంట ల్ డాక్టర్ ఆయుబ్‌ఖాన్ కుమారుడు ముజామి ల్‌ను తెల్లవారుజామున విచారణ చేసింది. ఉగ్రవాద సంస్థకు చెందిన పలు టెలిగ్రామ్ గ్రూప్‌లలో ముజామిల్ మెంబర్?గా ఉండటం తో వివిధ కోణాల్లో ప్రశ్నించి, వివరాలు సేకరించినట్లు సమాచారం. అయితే ఏఐ కోర్సు నేర్చుకోవడం కోసం ఆయా గ్రూపుల్లో చేరానని, ఏడాదిన్నర క్రితమే వాటి నుంచి బయటకు వచ్చినట్లు ముజామిల్ చెప్పినట్లు తెలిసింది. సెప్టెంబర్ 15న అహ్మదాబాద్‌లోని ఎన్ఐఏ ఆఫీస్‌లో విచారణకు హాజరుకావాలని ముజామి ల్‌కు ఎన్ఐఏ అధికారులు నోటీసులు ఇచ్చారు. ముజామిల్ ల్యాప్‌టాప్‌ను రామగుండం పోలీసులకు అప్పగించి సాంకేతిక అంశాలపై వివరాలు సేకరించారు. ఈ విషయంలో ఎన్ఐఏ అధికారులు, స్థానిక పోలీసులు అధికా రికంగా ఎలాంటి వివరాలను వెల్లడిం చలేదు. స్థానికంగా కలకలం : రామగుండంలో




జాతీయ దర్యాప్తు సంస్థ అధికారులు తనిఖీలు చేయడం కలకలం రేపింది. అయితే గతంలోనూ ఇలాంటి తనిఖీలు చేయగా, టెర్రరిస్టుల లింకులు బయటపడటంతో స్థానిక వాసులు మరోసారి తీవ్రంగా చర్చించుకుం టున్నారు. పలు ఉదంతాలివీ : అహ్మదాబాద్‌లో నమోదైన సైబర్ టెర్రరిజం కేసుకు సంబంధించి దేశవ్యాప్తంగా 5 చోట్ల ఎన్?ఐఏ సోదాల్లో భాగంగా ఈ తనిఖీలు జరిగినట్లు సమాచారం. టెలిగ్రామ్ గ్రూపుల ద్వారా ఏఐ (ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్) కోర్సుల పేరుతో విదేశీ హ్యాండర్లు యువతను ఆకర్షించి, వారి ద్వారా సైబర్, దేశ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్నారు. ఈ క్రమంలో ఎన్ఐఏ సోదాలు జరిపింది. సుమారు 20 ఏళ్ల క్రితం రామగుండంలో ఓ యువకుడిని ఉగ్ర లింకులతో అదుపులోకి తీసుకున్న విషయం ఈ సమయంలో స్థానికులు గుర్తు చేసుకుంటున్నారు. కరీంనగర్ జిల్లా కేంద్రంపై ఎన్ఐఏ గత కొన్నేళ్లుగా పటిష్ఠమైన నిఘా ఉంచింది. 2023 ఆగస్టులో హుస్సేనిపు రా కాలనీలోని ఓ యువకుడి ఇంట్లో తెల్లవాం ుజామున 4 గంటలకే తనిఖీలు నిర్వహించారు. నిషేధిత పాపులర్ ఫ్రంట్ ఆఫ్ ఇండియా (పీఎఫ్ఐ)తో ఇతనికి ఉన్న లింకులపై అధికారు లు ఆధారాలను సేకరించారు. నిందితుడు విదేశాల్లో ఉంటున్నప్పటికీ ఇంట్లో లభించిన డిజిటల్ పరికరాలు, కంప్యూటర్ హార్డ్ డిస్క్‌లను ఎన్?ఐఏ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. యువకులకు ఉన్న సంబంధాలపై ఆరా : జగిత్యాల పట్టణంలో 2023 సెప్టెంబరులో జరిగిన సోదాలు రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టించిన సంగతి తెలిసిందే. నిజామాబాద్‌కు చెందిన పీఎఫ్ఐ సానుభూతిపరుడితో జగిత్యాల యువకులకు ఉన్న సంబంధాలపై ఎన్ఐఏ విస్తృతంగా ఆపరేషన్ చేపట్టింది. టీఆర్?నగర్, టవర్ సర్కిల్‌లోని పలు మెడికల్ దుకాణాలతో పాటు సుమారు 7 ప్రాంతాల్లో ఒకేసారి సోదా లు జరిగాయి. ఇదే రోజు కరీంనగర్‌లో ఆశ్ర యం పొందుతున్న జగిత్యాల వాసిని అధికా రులు అదుపులోకి కూడా తీసుకున్నారు.

# సీజనల్ పరిస్థితులు, నీట్ పీజీ పరీక్ష ఏర్పాట్లపై కలెక్టర్లతో సీఎస్ సమీక్ష



**హైదరాబాద్, ఆగస్టు 25:** రాష్ట్రంలోని అన్ని జిల్లా కలెక్టర్లతో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు మంగళవా రం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. సీజనల్ పరిస్థితులు, ప్రజలకు అవసరమైన సేవలు, నీట్ పీజీ ప్రవేశ పరీక్ష ఏర్పాటు తదితర అంశాలపై కలెక్టర్లతో ఆయన సమీక్షించారు. ఆయా అంశాలపై చేపడుతున్న చర్యలను కలెక్ట ర్లను ఆయన అడిగి తెలుసుకు న్నారు. సీజనల్ పరిస్థితులను దృష్టిలో పెట్టుకుని అధికారులు ముందస్తు చర్యలు చేపట్టాలని వారికి సీఎస్ సూచించారు. వర్షాలు, వరదలు నేపథ్యంలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అవసరమైన ఏర్పాట్లు చేపట్టాలని స్పష్టం చేశారు. అత్యవసర పరిస్థితులు ఎదురైతే వెంట నే స్పందించేలా జిల్లా యంత్రాంగం సిద్ధంగా ఉండాలని ఆదేశించారు. ఇక నీట్ పీజీ ప్రవేశ పరీక్ష నిర్వహణకు సంబంధించి జిల్లాల్లో చేపట్టాల్సిన ఏర్పాట్లపై సీఎస్ ప్రత్యేకంగా సమీక్షించారు. పరీక్షా కేంద్రాల వద్ద మౌలిక వసతులు, భద్రత, విద్యుత్, తాగునీరు, పారిశు ద్ధ్యం, రవాణా తదితరత అంశాలపై అధికారు లతో చేయాలని సూచించారు. ఈ ప్రవేశపరీక్షను ప్రశాంతంగా నిర్వహించేందుకు ముందస్తు ప్రణాళికతో చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్లను సీఎస్ సంజయ్ జాజు ఆదేశించారు.

# తాడిచెర్ల గనిలో పచ్చదనం పరిమళం

- ఏఎంఆర్ ఆధ్వర్యంలో వనమహోత్సవం
- అటవీ, పోలీసు అధికారులతో కలిసి మొక్కలు నాటిన కంపెనీ ప్రతినిధులు

**మల్హర్, ఆగస్టు 25(మన విశ్వం):** పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యమిస్తూ తాడిచెర్ల ఓపెన్‌కాస్ట్ ప్రాజెక్టు-1లో ఏఎంఆర్ కంపెనీ ఆధ్వ ర్యంలో వనమహోత్సవాన్ని నిర్వహి ంచా రు. కంపెనీ వైస్ ప్రెసిడెంట్ ప్రభాకర్‌రెడ్డి నేతృ త్వంలో చేపట్టిన కార్యక్రమంలో అధికారులు, కార్మికులు పెద్దఎత్తున మొక్కలు నాటారు.
ముఖ్య అతిథులుగా అటవీశాఖ సీసీఎఫ్ ప్రభాకర్, డీఎఫ్ఓ కృష్ణగౌడ్, ఎఫ్‌డీఓ అప్పలకొండ, కాటారం డీఎస్పీ సూర్యనా



రాయణ హాజరై మొక్కలు నాటారు. పర్యావరణ పరిరక్షణలో మొక్కల పెంపకం కీలకమని ఈ సందర్భంగా పేర్కొన్నారు.
కార్యక్రమంలో ఏఎంఆర్ కంపెనీ సేఫ్టీ మేనేజర్ సురేష్, తాడిచెర్ల సర్పంచి బండి స్వామి, కంపెనీ సిబ్బంది, కార్మికులు పాల్గొన్నారు.

# నల్గొండలో విద్యా సామర్థ్యాలపై కలెక్టర్ దృష్టి

- కంచనపల్లి మండల ప్రాథమిక పాఠశాల ఆకస్మిక తనిఖీ
- విద్యార్థుల చదవడం, రాయడం నైపుణ్యాల పరిశీలన
- కనీస విద్యా సామర్థ్యాల పెంపుపై ఉపాధ్యాయులకు సూచనలు
- తెలుగు, ఇంగ్లీష్ పదాల అర్థాలు నేర్పాలని ఆదేశం

**నల్గొండ, ఆగస్టు 25 (మన విశ్వం):** విద్యార్థుల్లో ప్రాథమిక స్థాయి నుంచే బలమైన విద్యా పునాది ఏర్పడేలా ఉపాధ్యా యులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని జిల్లా కలెక్టర్ బి. చంద్ర శేఖర్ సూచించారు. మంగళవారం నల్గొండ మండలంలోని కంచనపల్లి మండల ప్రాథమిక పాఠశాలను ఆకస్మికంగా సందర్శించిన ఆయన విద్యార్థుల విద్యా సామర్థ్యాలను నేరుగా పరిశీలించారు. తరగతి గదుల్లో విద్యార్థులతో మాట్లాడి వారి చదవడం, రాయడం, అర్థం చేసుకునే నైపుణ్యాలను పరీక్షిం చారు. పాఠశాల సందర్శన సందర్భంగా ప్రతి విద్యార్థి స్పష్టంగా చదవగలగడం, సరిగా రాయగలగడం అత్యంత ముఖ్యమని కలెక్టర్ పేర్కొన్నారు. ముఖ్యంగా తెలుగు, ఇంగ్లీష్ భాషల్లో పదాలను గుర్తించడం మాత్రమే కాకుండా వాటి అర్థాలను కూడా తెలుసుకునే స్థాయికి విద్యార్థులను తీసుకెళ్లాలని



ఉపాధ్యాయులకు సూచించారు. భాషా పటిమ పెరగడం ద్వారా ఇతర విషయాలను సైతం సులభంగా అర్థం చేసుకునే సామర్థ్యం అభివృద్ధి చెందుతుందని వివరించారు.
ప్రాథమిక స్థాయిలో కనీస విద్యా సామర్థ్యాలు బలపడకపోతే ఉన్నత తరగతుల్లో విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొనే అవకాశం ఉంటుందని కలెక్టర్ తెలిపారు. అందువల్ల ప్రతి విద్యార్థి నేర్చుకునే స్థాయిని నిరంతరం అంచనా వేస్తూ అవసరమైన చోట అదనపు శిక్షణ అందించాలని సూచించారు. విద్యార్థుల అభ్యాసంలో వెనుకబడిన వారిని గుర్తించి ప్రత్యేక దృష్టితో ముందుకు తీసుకురావాలని చెప్పారు. కొత్త పదాలను నేర్పేటప్పుడు వాటి అర్థాలను కూడా వివరించాలని, పదే పదే చదివించడం, రాయించడం ద్వారా విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం పెంచాలని ఉపాధ్యాయులకు సూచించారు. పాఠ్యపుస్తకాల బోధనతో పాటు భాషా నైపుణ్యాల అభివృద్ధికి ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించాలని అన్నారు. విద్యార్థుల్లో పఠన అలవాటు పెంపొందించే దిశగా పాఠశాలలు చొరవ చూపాలని పేర్కొన్నారు. పాఠశాలల్లో బోధన నాణ్యత మెరుగుపడితేనే విద్యార్థుల భవిష్యత్ బలోపేతం అవుతుందని కలెక్టర్ అభిప్రా యపడ్డారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న ప్రతి విద్యార్థి నాణ్యమైన విద్యను అందుకునేలా చర్యలు కొనసాగు తున్నా యని తెలిపారు. ఉపాధ్యాయులు తమ బాధ్యతలను సమర్థ వంతంగా నిర్వర్తిస్తూ విద్యార్థుల అభివృద్ధికి కృషి చేయాలని సూచించారు. విద్యార్థుల ప్రగతిని నిరంతరం పర్యవేక్షిస్తూ అవసరమైన మార్గదర్శకత్వం అందించాలని కలెక్టర్ ఉపాధ్యా యులకు ఆదేశించారు. ప్రాథమిక స్థాయి నుంచే విద్యార్థుల్లో భాషా, రచనా, పఠన సామర్థ్యాలను పెంపొందించడం ద్వారా ఉన్నత విద్యలో మెరుగైన ఫలితాలు సాధించవచ్చని చెప్పారు. విద్యా నాణ్యత పెంపు లక్ష్యంగా జిల్లా వ్యాప్తంగా పాఠశాలల పనితీరును నిరంతరం

# మంత్రి కొండా సురేఖ మాజీ ఓఎస్డీ కేసు.

**హైదరాబాద్, ఆగస్టు 25:** మంత్రి కొండా సురేఖ మాజీ ఓఎస్డీ సుమంత్ కేసులో కీలక పరిణా మం చోటుచేసుకుంది. ఈ కేసులో విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించారనే ఆరోపణలతో జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్ సీఐ ముత్తు యాదవ్‌పై ఉన్నతాధికారులు సస్పెన్షన్ వేటు వేశారు. ఈ కేసులో ఎఫ్ఐఆర్ నమోదు చేయడంలో అలసత్వం వహించడంతో పాటు.. కేసు నమోదైన తర్వాత నిందితుడిని అదుపులోకి తీసుకునే విషయంలోనూ నిర్లక్ష్యంగా వహించా రనే ఆరోపణలపై పోలీస్ ఉన్నతాధికారులు ఈ చర్యలు తీసుకున్నట్లు తెలుస్తోంది. అయితే సీఐ ముత్తు యాదవ్ కేవలం 3 వారాల క్రితమే జూబ్లీహిల్స్ ఇన్‌స్పెక్టర్‌గా బాధ్యతలు స్వీకరిం చారు. ఈ నేపథ్యంలోనే బాధ్యతలు చేపట్టిన కొన్ని రోజులకే ఇలా సస్పెన్షన్‌కు గురికావడం పోలీసు వర్గాల్లో తీవ్ర చర్చనీయా ంశంగా మారింది. ఈ కేసులో పోలీసుల దర్యాప్తు తీరుపై ఉన్నతాధికారులు ప్రత్యేకంగా దృష్టి పెట్టినట్లు తెలుస్తోంది. జూబ్లీహిల్స్‌లోని సుమంత్ ఆఫీసుకు గత నెల 30వ తేదీన చెంగిచెర్లకు



చెందిన రియల్ ఎస్టేట్ వ్యాపారి గొంగిడి హరికృష్ణను డబ్బు వ్యవహారంపై మాట్లాడేందుకు పిలిపించినట్లు పోలీసులు గుర్తించారు. అక్కడ సుమంత్‌తో పాటు అతని అనుచరులు ప్రశాంత్, అరుణ్ కుమార్‌రెడ్డి, కార్తీక్, మహేందర్‌రెడ్డి, రాము సహా పలువురు వ్యక్తులు హరికృష్ణపై ఇనుప రాడ్‌తో దాడి చేసినట్లు ఫిర్యాదు నమోదైంది. ఈ దాడిలో తీవ్రంగా గాయపడిన హరికృష్ణ.. చెంగిచెర్ల పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా కేసు నమోదు చేశారు. జీరో ఎఫ్ఐఆర్ నమోదు చేసి.. ఆ తర్వాత ఆ కేసును జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్‌కు ట్రాన్స్‌ఫర్ చేశారు. అయితే ఈ వ్యవహారం బయటకు రావడంతో సుమంత్ తన ఫోన్లు స్విచ్చాఫ్ చేసి పరారైనట్లు పోలీసు లు చెబు తున్నారు. ప్రస్తుతం ఆయన కోసం ప్రత్యేక బృందాలు గాలిస్తున్నాయి. పోలీస్ స్టేషన్లకి జేసీ స్టేషన్ అని పేరు పెట్టండి: కేతిరెడ్డి పెద్దారెడ్డి మంత్‌ను పట్టుకునేందుకు జూబ్లీహిల్స్ పోలీసు లు ఇప్పటికే మూడు ప్రత్యేక బృందాలను ఏర్పా టు చేశారు. టాస్క్‌ఫోర్స్ పోలీసులు కూడా మరో బృందంతో గాలింపు చేపట్టినట్లు తెలు స్తోంది. ఇప్పటికే ఈ కేసులో నలుగురిని అరెస్ట్ చేశారు. సుమంత్ డ్రైవర్ నవీన్‌ను పోలీసులు అదుపులోకి తీసుకుని విచారణ చేస్తున్నారు. ఇదిలా ఉండగా.. సుమంత్ కేసులో ఎఫ్ఐఆర్ నమోదు, నిందితుడి అరెస్టు విషయంలో జూబ్లీహిల్స్ సీఐ ముత్తు యాదవ్ వ్యవహరించిన తీరుపై ఉన్నతాధికారులు సమీక్షించిన తర్వాత సస్పెన్షన్ నిర్ణయం తీసుకున్నారని పోలీస్ వర్గాల్లో చర్చ జరుగుతోంది.

# మైనారిటీ వర్గాల కోసం తాజుద్దీన్ చేసిన సేవలు మరువలేనివి



**హైదరాబాద్, ఆగస్టు 25:** బీఆర్ఎస్ పార్టీ మైనారిటీ విభాగం మాజీ అధ్యక్షుడు తాజుద్దీన్ అకాల మరణం పట్ల మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మంగళవారం ఖమ్మం నగరంలో తాజుద్దీన్ పార్థివదేహాన్ని పువ్వాడ అజయ్ కుమార్ సందర్శించి నివాళులర్పించారు. అనంతరం ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించి, వారికి తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఈ సందర్భంగా తాజుద్దీన్‌తో తనకున్న అనుబంధాన్ని, పార్టీకి, మైనా రిటీ వర్గాల కోసం ఆయన అందించిన సేవలను పువ్వాడ అజయ్ కుమార్ గుర్తు చేసుకున్నారు. తాజుద్దీన్ మృతి పార్టీకి, మైనారిటీ వర్గాలకు తీరని లోటని, ఆయన లేని లోటును ఎవరూ పూడ్చలేరని అన్నారు. తాజుద్దీన్ ఆత్మకు శాంతి చేకూరాలని, ఆయన కుటుంబ సభ్యులకు ఈ విషా దాన్ని తట్టుకునే మనోధైర్యాన్ని భగవంతుడు ప్రసాదించాలని అజయ్ కుమార్ ఆకాంక్షించారు.

# నషా ముక్త్ సమాజ నిర్మాణంలో యువత పాత్ర కీలకం

**నిజామాబాద్, ఆగస్టు 25 :**
నషా ముక్త్ సమాజ నిర్మాణంలో యువత పాత్ర కీలకమని తెలంగాణ గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా వ్యాఖ్యానించారు. యువత మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండి, విద్యా క్రీడా రంగాల్లో రాణించాలని సూచించారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ నేతృత్వంలో నషా ముక్త్ భారత్ అభియాన్ ప్రజా ఉద్య మంగా రూపుదిద్దుకుంటుందని పేర్కొ న్నారు. నిజామాబాద్ జిల్లాలో (మంగళవారం) నషా ముక్త్ భారత్ అభియాన్‌పై విద్యార్థుల



తో ముఖాముఖి నిర్వహించారు. ఈ కార్యక్ర మంలో ముఖ్య అతిథిగా గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా, ఎంపీ అర్వింద్, ఎమ్మెల్యేలు సూర్యనారాయణ, రాకేశ్ రెడ్డి, జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా, పోలీసు కమిషనర్ సాయి చైతన్య పాల్గొన్నారు. ఈ సందర్భంగా గవర్నర్ మాట్లాడారు. పిల్లల ప్రవర్తనను తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. నషా ముక్త్ భారత్ నిర్మాణంలో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం కావాలని గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా పిలుపునిచ్చారు.

# ప్రతి మొక్కను సంరక్షించాలి.

**హైదరాబాద్, ఆగస్టు 25 :** రాష్ట్ర వ్యాప్తంగా వన మహోత్సవాన్ని విజయవంతం చేయాలని మంత్రి సీతక్క (ఎవశ్రీఖఅస్త్రుఖఋ వీఱఅఱర్‌వతీ ూవవ్ష్ఠుఎఝ) సంబంధిత అధికారులను ఆదేశించారు. వన మహోత్సవం లక్ష్యాలను నిర్ణీత గడువులో పూర్తి చేయాలని దిశానిర్దేశం చేశారు. ఈరోజు (మంగళవారం) రాష్ట్ర సచివాలయంలో గ్రామీణ అభివృద్ధి శాఖపై మంత్రి సీతక్క వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమీక్షలో కమిషనర్ దివ్య, స్పెషల్ కమిషనర్ శ్రీలక్ష్మి, జిల్లా సీఈవోలు, డీఆర్డీవోలు, డీపీవో, అడిషనల్ డీఆర్డీవోలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అధికారులకు పలు కీలక అంశాలపై మంత్రి సీతక్క దిశానిర్దేశం చేశారు. ఉపాధి హామీ పనులు, పంట కుంటల నిర్మాణం, మహిళా సంఘ భవనాల నిర్మాణం, నూతన చేయూత పెన్షన్ల మంజూరుపై సమీక్షించారు. ఇప్పటివరకు ఇచ్చిన టార్గెట్‌లో 86శాతం మొక్కలు నాటామని తెలిపారు. 6.18 కోట్ల మొక్కలు నాటి లక్ష్యాన్ని నిర్దేశించుకుని 5.32 కోట్ల మొక్కలను నాటినట్లు వెల్లడించారు. మొక్కలు నాటిన విధంగానే.. నాటిన మొక్కల వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని మంత్రి సీతక్క ఆదేశించారు. ప్రతి మొక్కను సంరక్షిస్తూ వందశాతం మనుగడ సాధించాలని చెప్పారు. నాటిన మొక్కలకు క్రమం తప్పకుండా నీటిని అందించాలని




సూచించారు. ప్రజాప్రతినిధులు, మహిళా సంఘాలు, విద్యార్థులు, యువతను భాగస్వాములను చేయాలని దిశానిర్దేశం చేశారు. మొక్కలకు రక్షణ కంచెలు తప్పనిసరిగా ఏర్పాటు చేయాలని తెలిపారు. అవెన్యూ ప్లాంటేషన్లలో ఫెన్సింగ్ పటిష్ఠంగా ఉండేలా చూడాలని అన్నారు. ప్రతి గ్రామ పంచాయతీలో రోజుకు కనీసం 60 మంది కూలీలకు ఉపాధి కల్పించాలని తెలిపారు. పనికి సిద్ధంగా ఉన్న ప్రతి కూలీకి పని అందేలా చర్యలు తీసుకోవాలని మంత్రి సీతక్క ఆదేశించారు. కూలీలకు వారి నివాస ప్రాంతానికి సమీపంలోనే ఉపాధి కల్పించాలని అన్నారు. ప్రతి గ్రామ పంచాయతీలో తగినంత పనుల షెల్ఫ్ సిద్ధంగా ఉంచాలని ఆదేశించారు. చీవీమీా హాజరును ప్రతిరోజూ పర్యవేక్షించాలని మార్గనిర్దేశం చేశారు. కూలీల సమీకరణ బాధ్యతను క్షేత్రస్థాయి సిబ్బందికి స్పష్టంగా అప్పగించాలని నిర్దేశించారు. మంజూరైన అన్ని ఫార్మ్ పాండ్ల పనులను వెంటనే ప్రారంభించాలని ఆదేశించారు. ఉపాధితో పాటు నీటి సంరక్షణకు శాశ్వత ఆస్తులుగా అభివృద్ధి చేయాలని మంత్రి సీతక్క సూచించారు. తక్కువ పనితీరు ఉన్న జిల్లాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని అన్నారు. స్పష్టమైన లక్ష్యాలు నిర్దేశించి నిరంతరం పర్యవేక్షించాలని తెలిపారు. ఉపాధి పనులతో పాటు నీటి సంరక్షణకు ప్రాధాన్యం ఇవ్వాలని ఆదేశించారు. ఆదివాసి గిరిజన ఏజెన్సీ ప్రాంతాల్లో చెక్ డ్యాముల నిర్మాణాన్ని వేగవంతం చేయాలని నిర్దేశించారు. ఫార్మ్ పాండ్లు, ఇతర నీటి సంరక్షణ పనులను వేగంగా ప్రారంభించాలని సూచించారు. గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి, నీటి సంరక్షణ, జీవనోపాధి ఆస్తుల సృష్టి ఏకకాలంలో జరగాలని చెప్పారు. ప్రభుత్వ లక్ష్యాలను క్షేత్రస్థాయిలో సమర్థవంతంగా అమలు చేయాలని మంత్రి సీతక్క ఆదేశించారు.

బుధవారం, ఆగస్టు 26, 2026
మన విశ్వం
VOICE OF THE PEOPLE-POWER OF TRUTH
తెలుగు వారి దినపత్రిక



# విశాఖ జూలో 128 కొత్త జీవాల జననం.. పవన్ కల్యాణ్ హర్షం




**అమరావతి, ఆగస్టు 25:** విశాఖపట్నంలోని ఇందిరా గాంధీ జూలాజికల్ పార్క్‌లో 12 రకాల జంతువులు, పక్షులు 128 కొత్త జీవాలకు జన్మనివ్వడంపై డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఆనందం వ్యక్తం చేశారు. దీనిపై సోషల్ మీడియా ఎక్స్ వేదికగా స్పందిస్తూ.. ప్రతి కొత్త జీవం మనలో కొత్త ఆశలు నింపుతుందని, ఒక జాతిని కాపాడటం అంటే ప్రకృతి సంపదను కాపాడుకోవటమే అని చెప్పుకొచ్చారు.'ప్రకృతి ఒడిలో కొత్త జీవం.. పరిరక్షణకు కొత్త బలం. విశాఖ ఇందిరా గాంధీ జూలాజికల్ పార్క్‌లో 12 రకాల జంతువులు, పక్షులు 128 కొత్త జీవాలకు జన్మనివ్వడం సంతోషకరమైన విషయం. అటవీ శాఖ ఆధ్వర్యంలో చేపట్టిన శాస్త్రీయ సంరక్షణ, పునరుత్పత్తి కార్యక్రమాలు సత్ఫలితాలనిస్తున్నాయి. ఇది రాష్ట్రంలో వన్యప్రాణుల సంరక్షణ చర్యలకు మరింత బలం చేకూరుస్తోంది. కృత్రిమ ఇంక్యుబేషన్ ద్వారా 10 ఎర్ర అడవి కోడి పిల్లలు, ఒక బ్లూ-గోల్డ్ మకావ్ పిల్లను విజయవంతంగా పొదిగించడం ప్రత్యేకంగా చెప్పుకోవాల్సిన అంశం. ఈ పునరుత్పత్తి ప్రక్రియలో భాగస్వాములైన అటవీ శాఖ అధికారులు, జూలాజికల్ పార్క్ సిబ్బంది, వెటర్నరీ బృందానికి హృదయపూర్వక అభినందనలు. ప్రతి కొత్త జీవం మనలో కొత్త ఆశలు నింపుతుంది. ఒక జాతిని కాపాడటం అంటే మన ప్రకృతి సంపదను కాపాడుకోవటమే. విజయాలు సాధించాలని ఆకాంక్షిస్తున్నాను' అంటూ ఎక్స్‌లో పవన్ కల్యాణ్ పోస్ట్ చేశారు.

# డిప్యూటీ స్పీకర్ రఘురామపై ఫిర్యాదు - కేసు నమోదులో నిబంధనలు పాటించాలన్న హైకోర్టు

**అమరావతి, ఆగస్టు 25:** శాసనసభ డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణ రాజు నుంచి తన ప్రాణానికి ముప్పు ఉందని, 2 ప్లస్ 2 పోలీసు భద్రత కల్పించేలా ఆదేశిం చాలని కోరుతూ పారిశ్రామికవేత్త అగతా ఎనర్జీ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ లిమిటెడ్ ఛైర్మన్/ డైరెక్టర్ మాదల శ్రీనివాసు వేసిన పిటిషన్‌పై సోమవారం హైకోర్టు విచారణ చేపట్టింది. శ్రీనివాసు ఫిర్యాదు ఆధారంగా కేసు నమోదు చేసే విషయ ంలో చట్ట నిబంధనలు పాటించాలని సూచి ంచింది.కాగ్నిజిబుల్ నేరానికి పాల్పడినట్లు ఆధారాలు లభిస్తే కేసు నమోదు చేయాల్సిన బాధ్యత పోలీసులపై ఉందని న్యాయస్థానం వ్యాఖ్యానించింది. పూర్తి వివరాలు సమర్పించాలని పోలీసులను ఆదేశిస్తూ విచారణను నాలుగు వారాలకు వాయిదా వేసిం ది. ఈ మేరకు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ కుంచం మహేశ్వరరావు ఉత్తర్వులు జారీ చేశారు.రఘురామకృష్ణరాజు




పంపినట్లుగా చెబుతున్న కొంతమంది వ్యక్తులు గుంటూర లోని తన ఇంట్లోకి అక్రమంగా ప్రవేశించారని మాదల శ్రీనివాసు పిటిషన్?లో తెలిపారు. అంతేకాక తనను కిడ్నాప్ చేసేందుకు యత్నించారని చెప్పారు. ఈ ఘటనపై ఈ ఏడాది జులై 31న ఫిర్యాదు చేసినప్పటికీ గుంటూరులోని పట్టాభిపురం పోలీసులు చర్యలు తీసుకోలేదని పేర్కొన్నారు. రఘురామకృష్ణరాజు, ఆయన కుటుంబ సభ్యుల ఆధీనంలో తమిళనాడులో ఉన్న 189 మెగావాట్ల ఇండ్-భారత్ పవర్ జెన్‌కామ్ లిమిటెడ్ సంస్థ ఆర్థిక సంక్షోభంలో ఉండగా నేషనల్ కంపెనీ లా ట్రైబ్యునల్ (ఎన్‌సీఎల్‌టీ)లో దివాలా ప్రక్రియ ఎదుర్కొందని వివరించారు. వేలం ప్రక్రియలో తాను ఛైర్మన్‌గా ఉన్న అగతా ఎనర్జీ, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ సంస్థ రూ.101.42 కోట్లకు దక్కించుకుందని వివరించారు.: దివాలా నిబంధనల ప్రకారం లభించిన డీడ్ ద్వారా ఇండ్-భారత్ పవర్ జెన్‌కామ్ పూర్వ యజమానుల నుంచి సొమ్ము వసూలు చేసుకునేందుకు చట్టపరంగా తనకు హక్కులు లభించాయని మాదల శ్రీనివాస్ తెలిపారు. కంపెనీకి చెందిన ఫైళ్లు అప్పగించాలని, ఎన్‌సీఎల్‌టీ వద్ద పెండింగ్‌లో ఉన్న రికవరీ అప్పీళ్లను వెనక్కి తీసుకోవాలని తన అనుచరుల తో బెదిరిస్తున్నారని శ్రీనివాసు పేర్కొన్నారు.

# ఏపీ లిక్కర్ స్కామ్ కేసు.. ఈడీ రిమాండ్ రిపోర్టులో సంచలన విషయాలు

**అమరావతి:** ఆంధ్రప్రదేశ్ లిక్కర్ రవాణా కేసులో వైసీపీ నేత, మాజీ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు అరెస్టయిన సంగతి తెలిసిందే. ఈ కేసుకు సంబంధించి ఏబీఎన్ ఆంధ్రజ్యోతి చేతికి ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) రిమాండ్ రిపోర్ట్ చిక్కింది. ఈ రిపోర్టులో మాజీ మంత్రి ఏ విధంగా అక్రమాలకు పాల్పడ్డారనే విషయాలను ఈడీ స్పష్టంగా వెల్లడించింది.రాజకీయ పలుకుబడిని ఉపయోగించుకుని మాజీ మంత్రి అక్రమాలకు పాల్పడ్డారని రిమాండ్ రిపోర్టులో ఈడీ ఆరోపించింది. లిక్కర్ రవాణా వ్యవహారంలో కారుమూరి ఖాతాలోకి రూ.11.95 కోట్లు వెళ్లినట్టు గుర్తించామని పేర్కొంది. మొత్తం రూ.18.09 కోట్ల మనీలాండరింగ్ జరిగినట్టు వెల్లడించింది. అక్రమ మార్గాల్లో వచ్చిన డబ్బుతో కారుమూరి అప్పులు తీర్చడంతో పాటు స్థిరాస్తులు కొనుగోలు చేసినట్టు పేర్కొంది. పుట్టినరోజు వేడుకలు నిర్వహించేందుకు, ఖరీదైన వాచీలు కొనుగోలు చేసేందుకు, విమాన ఛార్జీలు చెల్లించేందుకూ ఖాతాలోని నగదును కారుమూరి ఉపయోగించినట్టు ఈడీ తెలిపింది.మరో నిందితుడు రాజ్ కసిరెడ్డికి మాజీ మంత్రి నెలకు రూ.50 లక్షల నుంచి రూ.60 లక్షల వరకు చెల్లించినట్టు ఈడీ రిమాండ్ రిపోర్ట్‌లో తెలిపింది.



లిక్కర్ రవాణా కేసులో కారుమూరికి మొత్తం 10 నోటీసులు ఇచ్చామని.. అయితే దర్యాప్తును అడ్డుకునేందుకు విచారణకు హాజరుకాకుండా తప్పించుకుని తిరిగారని ఆరోపించింది. మద్యం రవాణాలో సబ్‌కాంట్రాక్టులు ఇప్పించినందుకు వచ్చే లాభాల్లో 50 శాతం వాటాను కారుమూరి నాగేశ్వరరావు వసూలు చేసినట్టు ఆరోపించింది. ఈ వ్యవహారంలో కొల్లగొట్టిన డబ్బును కుటుంబ సభ్యుల ఖాతాలకు మళ్లించినట్టు ఈడీ పేర్కొంది. సుదర్శన్ కన్‌స్ట్రక్షన్ పేరిట కారుమూరి సబ్‌కాంట్రాక్ట్ పొందినట్టు ఈడీ తెలిపింది. ఆ కాంట్రాక్ట్ ద్వారా వచ్చిన ఆదాయంలో 85 శాతం కారుమూరి కుటుంబానికి, 15 శాతం సుదర్శన్ కన్‌స్ట్రక్షన్‌కు చెల్లించేలా ఒప్పందం చేసుకున్నట్టు రిమాండ్ రిపోర్ట్‌లో పేర్కొంది. సుదర్శన్ కన్‌స్ట్రక్షన్ ప్రతినిధి సందీప్ ద్వారా ఈ చెల్లింపులు జరిగినట్టు గుర్తించినట్టు తెలిపింది. లిక్కర్ రవాణా వ్యవహారంలో అక్రమంగా వచ్చిన నిధుల మళ్లింపు, సబ్‌కాంట్రాక్టుల ద్వారా జరిగిన లావాదేవీలు, కుటుంబ సభ్యుల ఖాతాలకు నిధుల బదిలీ వంటి అంశాలపై దర్యాప్తు కొనసాగుతోందని ఈడీ చెప్పుకొచ్చింది.

# క్రిమినల్ రాజకీయ పార్టీ పెడితే ఎలా ఉంటుందో ఏపీలో చూస్తున్నాం

**అమరావతి, ఆగస్టు 25:** సమాజంలో క్రిమినల్ అంటే భయపడ తామని, క్రిమినల్ చేసే పనులు సమాజా నికి హానికరమని మంత్రి అచ్చెన్నాయుడు అన్నారు. అటువంటి క్రిమినల్.. రాజకీయ పార్టీ పెట్టి రాజకీయాలు చేస్తే ఎలా ఉంటుందనేది ఏపీలో చూస్తున్నామని తెలిపారు. క్రిమినల్ చేసిన తప్పులు వేరేవారిపై పెట్టి వారు బాధితులుగా మారే విధంగా చేస్తారని మండిపడ్డారు. 2004లో తండ్రి అధికారాన్ని అడ్డం పెట్టుకుని జగన్ ఎంతమందిని జైలుకు పంపించారో అందరికీ తెలుసన్నారు.



2019లో మాయమాటలు చెప్పి అధికారంలోకి వచ్చి ప్రకృతి వనరులను దోచుకున్నారని ఆరోపించారు.బలహీన వర్గాలను అడ్డం పెట్టుకుని మెడ మీద కత్తి పెట్టి మరీ వేధింపులకు గురిచేశారని మంత్రి విమర్శించారు. గొడ్డలిపార్టీ అధినేత ఆర్థికంగా బలపడ్డారని.. బలహీన వర్గాలను బాధితులను చేశారని ఆరోపించారు. 2019 నుంచి 2024 వరకు ఏం చేశారని ప్రశ్నించారు. కేంద్ర ప్రభుత్వంలోని ఈడీ.. కారుమూరి నాగేశ్వరరావును అరెస్ట్ చేసిందన్నారు. 'జోగి రమేష్ నీ కుటుంబ వ్యవహారంతో చంద్రబాబు, లోకేశ్‌కు ఏంటి సంబంధం? మీ లాంటి నీచ చరిత్ర చంద్రబాబుకు, లోకేశ్‌కు లేదు. ముందు తెలుసుకోండి' అంటూ వ్యాఖ్యానించారు. 2014 నుంచి 2019 వరకు బీసీలకు స్వర్ణయుగమని మంత్రి అచ్చెన్నాయుడు పేర్కొన్నారు.

# తిరుమల శ్రీవారి లడ్డూ ప్రసాదంలో దారం.



**తిరుమల:** శ్రీవారి లడ్డూ ప్రసాదంపై సోషల్ మీడియాలో జరుగుతున్న దుష్ప్రచారం సరికాదని తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) స్పష్టం చేసింది. లడ్డూ ప్రసాదంలో దారం కనిపించిందంటూ సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న వీడియో తమ దృష్టికి వచ్చిందని తెలిపింది. భక్తుల మనోభావాలను దెబ్బతీసేలా నిర్ధారణ లేని వీడియోలను ప్రచారం చేయవద్దని టీటీడీ విజ్ఞప్తి చేసింది.టీటీడీ ప్రతిరోజూ శ్రీ వైష్ణవ బ్రాహ్మణుల ఆధ్వర్యంలో శ్రీవారి లడ్డూ ప్రసాదాలను అత్యంత పవిత్రతతో, పరిశుభ్రతా ప్రమాణాలను పాటిస్తూ భారీ స్థాయిలో తయారు చేసి భక్తులకు అందిస్తోందని తెలిపింది. లడ్డూ తయారీకి వినియోగించే ముడి పదార్థాలను ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఆధారిత ఇంటిగ్రేటెడ్ సార్టింగ్ మిషన్ ద్వారా అత్యంత ఖచ్చితత్వంతో తనిఖీ చేస్తున్నట్లు పేర్కొంది. ముడి పదార్థాల నాణ్యత, పరిశుభ్రత విషయంలోనూ టీటీడీ కఠినమైన ప్రమాణాలను పాటిస్తోందని వెల్లడించింది.ఈ విధానంలో లడ్డూ తయారీలో వేరే పదార్థాలు కలిసేందుకు అవకాశమే ఉండదని టీటీడీ స్పష్టం చేసింది. భక్తులకు అందించే ప్రతి ప్రసాదం నాణ్యతగా ఉండేలా నిరంతరం పర్యవేక్షణ కొనసాగుతోందని తెలిపింది.కొందరు వ్యక్తులు టీటీడీ ప్రతిష్ఠను దెబ్బతీసే ఉద్దేశంతో స్వామివారి పవిత్ర లడ్డూ ప్రసాదంపై భక్తుల్లో అపోహలు కలిగించేలా నిర్ధారణ లేని వీడియోలను రూపొందించి సోషల్ మీడియాలో వైరల్ చేయడం సరికాదని టీటీడీ పేర్కొంది. శ్రీవారి ప్రసాదం విషయంలో భక్తుల మనోభావాలు దెబ్బతినేలా వ్యవహరించవద్దని విజ్ఞప్తి చేసింది. శ్రీవారి ప్రసాదాల పవిత్రత, నాణ్యత, పరిశుభ్రతలను కాపాడటానికి టీటీడీ ఎల్లప్పుడూ అత్యంత ప్రాధాన్యత ఇస్తుందని స్పష్టం చేసింది.

# అమరావతిలో ప్రపంచంలోనే ఎత్తైన ఫెర్రిస్ వీల్

**అమరావతి:** రాజధాని అమరావతిలో ప్రపంచంలోనే అత్యంత ఎత్తైన 'ఫెర్రిస్ వీల్'ను నిర్మించనున్నా రు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆలోచనల మేరకు దీనికి ప్రణాళికలు సిద్ధమయ్యాయి. దీని నిర్మాణ బాధ్యతలు పర్యవే క్షిస్తున్న అమరావతి గ్రోత్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ (ఏజీఐసీఎల్) తాజాగా మళ్లీ టెండ ర్లను ఆహ్వానించింది. పర్యాటకులను విశేషంగా ఆకర్షించేలా ఈ కట్టడాన్ని అద్భుతంగా తీర్చిదిద్దనున్నారు.లండన్ ఐ స్ఫూర్తితో : రాజధానిలోని కృష్ణా నది ఒడ్డున ఈ భారీ ఫెర్రిస్ వీల్‌ను నిర్మించనున్నారు. బ్రిటన్ రాజధా ని లండన్‌లో థేమ్స్ నది తీరాన ఉన్న 'లండన్ ఐ' స్ఫూర్తితో ఈ ప్రాజెక్టును చేపట్టనున్నారు. అందుకే దీనికి 'అమరావతి ఐ' అని నామకరణం చేశారు. లండన్ ఐ ఎత్తు 120 మీటర్లు. అయితే మన అమరావతి ఐ ఎత్తును మొదట 139 మీటర్లుగా ప్రతిపాదిం చారు. భవిష్యత్తులో ఇది రాజధాని నగరానికే ప్రధాన ఆకర్షణగా నిలవనుంది.వాణిజ్య స్థలం పెంపు : ఫెర్రిస్ వీల్ నిర్మాణం కోసం గతంలోనే ఏజీఐసీఎల్ టెండర్లు పిలిచింది. వీల్ కోసం 5 ఎకరాలు, కమర్షియల్ (వాణిజ్య) అవసరాలకు ఒక ఎకరం ఇస్తామని ప్రకటించింది. కానీ ఆ టెండర్లకు స్పందన రాలేదు. అమరావతి ఇంకా



నిర్మాణ దశలోనే ఉంది. ఈ క్రమంలో వాణిజ్య అవసరాలకు కేవలం ఒక ఎకరం ఇస్తే, ప్రాజెక్టు లాభదాయకంగా ఉండదని ప్రీ బిడ్ మీటింగ్‌లో నిర్మాణ సంస్థలు తెలిపాయి. వాణిజ్య స్థలాన్ని మరింత పెంచాలని కోరాయి. వారి వినతుల నేపథ్యంలో నిబంధనలు సవరించి ఏజీఐసీఎల్ తాజాగా మళ్లీ టెండర్లు పిలిచింది.ప్రపంచ రికార్డును బద్దలు కొట్టేలా : ప్రస్తుతం దుబాయ్‌లోని 'ఎయిన్ దుబాయ్' ప్రపంచంలోనే అత్యంత ఎత్తైన ఫెర్రిస్ వీల్. దీని ఎత్తు 250 మీటర్లు. అందులో 48 కాప్స్యూల్స్ ఉంటాయి. ఒకేసారి 1,750 మంది అందులో కూర్చోవ చ్చు. ఆ తర్వాత అమెరికాలోని లాస్ వెగాస్‌లోని హై రోలర్ (167.6 మీటర్లు), సింగపూర్ ఫ్లయ ర్ (165 మీటర్లు) ఉన్నాయి. అయితే, అమరా వతి ఐని ప్రపంచంలోనే అత్యంత ఎత్తుగా నిర్మించాలని సీఎం చంద్రబాబు సూచించారు. అందుకే 250 మీటర్ల కంటే ఎత్తుగా నిర్మించేందుకు ఎవరైనా ముందుకొస్తే అవకాశం ఇచ్చేలా తాజా టెండర్లు రూపొందిం చారు.ఎత్తును బట్టి స్థలాల కేటాయింపు : తాజా టెండర్ల ప్రకారం, ఎత్తును బట్టి మూడు క్యాటగిరీలుగా ప్రాజెక్టును విభజించారు. వీల్ నిర్మాణానికి గ్రీన్ జోన్‌లో 5 ఎకరాలు ఉమ్మడిగా కేటాయిస్తారు.128-175 మీటర్ల ఎత్తు ఉంటే వాణిజ్య అవసరాలకు ఒక ఎకరం ఇస్తారు.175-200 మీటర్ల ఎత్తు ఉంటే కమర్షియల్ స్థలాన్ని 3 ఎకరాలకు పెంచుతారు. 200-250 మీటర్లకు 4 ఎకరాలు కేటాయిస్తారు.ఒకవేళ 250 మీటర్ల కంటే ఎత్తు నిర్మిస్తే 5 వతి ఐని ప్రపంచంలోనే అత్యంత ఎత్తుగా ఎకరాల కమర్షియల్ స్థలం ఇస్తారు.కానీ, ఫెర్రిస్ వీల్ కనీస ఎత్తు 139 మీటర్లు, వ్యాసం 128 మీటర్ల కంటే తగ్గకూడదని స్పష్టం చేశారు. అంతకంటే తక్కువ కోట్ చేస్తే బిడ్‌ను తిరస్కరిస్తారు.నిర్మాణ గడువులు ఇలా : వీల్ వ్యాసాన్ని బట్టి నిర్మాణ గడువును కూడా అధికారులు నిర్ణయించారు. 128 మీటర్ల వ్యాసం ఉంటే 12 నెలలు, 128 నుంచి 175 మీటర్లకు 15 నెలలు గడువు ఇచ్చారు. 175-200 మీటర్లకు 18 నెలలు, 200 మీటర్లు దాటితే రెండేళ్ల (24 నెలలు) గడువు ఉంటుంది. ఈ ప్రాజెక్టుకు బిడ్ల దాఖలు గడువు ఈ నెల 27వ తేదీతో ముగుస్తుంది. మొదట ప్రతిపాదించిన 139 మీటర్ల వీల్‌లో 28 ఏసీ కాప్స్యూల్స్ ఉంటాయి. ఒక్కో దానిలో 20 మంది చొప్పున ప్రయాణించే వీలుంటుంది.

# డిసెంబర్ చివరి నాటికి క్వాంటం బిల్డింగ్ పనులు పూర్తి

**అమరావతి:** మంత్రి నారాయణ రాజధాని అమరావతిలో పర్యటించారు. ఈ క్రమంలో ఆయన రాజధాని అమరావతిలో జరుగుతున్న క్వాంటం కంప్యూటింగ్ భవన నిర్మాణ పనులను పరిశీలించారు. జనవరిలో రాజధానిలో క్వాంటం కంప్యూటింగ్ సేవలు ప్రారంభం కానున్నాయని తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ అమరావతి నాలెడ్జ్ హబ్‌గా తయారు అవుతుందని పేర్కొన్నారు. డిసెంబర్ చివరి నాటికి క్వాంటం బిల్డింగ్ సిద్ధమవుతుందన్నారు. హైదరాబాద్‌లో టీ హబ్‌లా అమరావతిలో క్వాంటం ఉండబోతుం దని వెల్లడించారు. చంద్రబాబు దూరదృష్టి వల్లే ప్రపంచవ్యాప్తంగా తెలుగువారు ఐటీ రంగంలో దూసుకువెళ్తున్నారని మంత్రి నారాయణ తెలిపారు.ఈ ఏడాది డిసెంబర్ నాటికి క్వాంటం కంప్యూటింగ్ భవన నిర్మాణాన్ని పూర్తి చేస్తాం. పనులు వేగంగా సాగుతున్నాయి. నిర్దేశించిన సమయానికే లక్ష్యాన్ని చేరుకుంటాం. అలాగే హైదరాబాద్ సైబర్ టవర్స్ తరహాలో క్వాంటం కంప్యూటింగ్ భవనం పక్కనే నిర్మిస్తున్న మరో



రెండు భవనాల నిర్మాణ పనులు కూడా వేగంగా జరుగుతున్నా యి.' -నారాయణ, పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రిమరో రెండు టవర్లు: కొన్ని ప్రత్యే కతలతో క్వాంటం వ్యాలీ నిర్మాణ పనులు జరుగుతున్నాయని మంత్రి నారాయణ తెలిపా రు. డిసెంబర్? చివరి నాటికి ఈ భవన నిర్మాణాలు పూర్తి కావాలని సీఎం చంద్రబాబు ఆదేశిం చినట్లు వివరించారు. ఈ క్రమంలో పనులన్నీ వేగవంతంగా జరుగుతున్నాయన్నారు. చాలా వరకు నిర్మాణ పనులు పూర్తయ్యాయని, ప్లంబర్ వర్క్స్ ప్రారంభం కానున్నాయని పేర్కొన్నారు. దేశంలోనే నంబర్ వన్‌గా ఏపీ: క్వాటం భవనా ల పక్కనే 37 లక్షల చదరపు అడుగుల స్థలంలో మరో 2 బిల్డింగ్స్?కి టెండర్లు కూడా పిలిచినట్లు తెలిపారు. ఇవి ఒక్కొక్కటి 48 అంతస్తులతో, 202 మీ పొడవుతో నిర్మించనున్నట్లు తెలిపారు. మరో 2, 3 నెలల్లో ఈ పనులు కూడా పూర్తవుతాయని మంత్రి నారాయణ వెల్లడించారు. హైదరాబాద్ లోని నిర్మాణాల వలే ఇవి ఉండనున్నాయన్నారు. ఈ ప్రత్యేకమైన నిర్మాణాలతో దేశంలోనే నంబర్ వన్‌గా ఆంధ్రప్రదేశ్ నిలవనుందని మంత్రి నారాయణ అన్నారు.ఇదిలా ఉండగా మరోవైపు రాజధాని అమరావతిలో ప్రపంచంలో నే అత్యంత ఎత్తైన 'ఫెర్రిస్ వీల్'ను నిర్మించను న్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆలోచనల మేరకు దీనికి ప్రణాళికలు సిద్ధమయ్యాయి. దీని నిర్మాణ బాధ్యతలు పర్యవేక్షిస్తున్న అమరావతి గ్రోత్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ (ఏజీఐసీఎల్) తాజాగా మళ్లీ టెండర్లను ఆహ్వానించింది.

# స్థానిక సంస్థల ఎన్నికలు నిష్పాక్షికంగా జరిగితే విజయం వైసీపీదే

**అమరావతి:** స్థానిక సంస్థల ఎన్నికలు స్వేచ్ఛగా, నిష్పక్షపాతంగా జరిగితే కూట మి ప్రభు త్వానికి వ్యతిరేకంగా ప్రజలు స్పష్టమైన తీర్పు ఇస్తారని వైసీపీ అధినేత జగన్ ధీమా వ్యక్తంచేశారు. పార్టీ ముఖ్య నేతలతో నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొని, రాబోయే స్థానిక ఎన్నికలపై దిశానిర్దేశం చేస్తూ పలు కీలక వ్యాఖ్యలు చేశారు. ఈ ఎన్నికలు కేవలం గెలుపోట ములకు సంబంధించినవి మాత్రమే కావని. క్షేత్రస్థాయిలో పార్టీ కోసం శ్రమి స్తున్న కార్యకర్తలకు అండగా నిలబడాల్సిన కీలక సమయమని జగన్ పేర్కొన్నారు.గతంలో జరిగిన ఎంపీటీసీ, జడ్పీటీసీ, మున్సిపాలిటీ ఎన్నికల్లో అధికార దుర్వినియోగం, దౌర్జన్యాలు చూశామన్న ఆయన.. ఈసారి ప్రతి స్థానంలోనూ సమర్థులైన, బలమైన అభ్యర్థులను పోటీకి దింపాలని సూచించారు. అవసరమైతే నాయకులు తమ కుటుంబసభ్యులను సైతం బరిలోకి దించేందుకు వెనకాడకూడదని పిలుపునిచ్చారు. ఏ నియోజకవర్గంలోనూ పోటీ లేకుండా ఏకగ్రీవాలకు తావు ఇవ్వకూడదని.. ఒకవేళ ఎక్కడైనా ఏకగ్రీవాలు జరిగితే అక్కడి కో-ఆర్డినేటర్లు భవిష్యత్తులో అసెంబ్లీ అభ్యర్థులుగా కొనసాగలేరని హెచ్చరించారు.



# రెండో టెస్ట్‌లో టీమిండియా పట్టు



## తొలి ఇన్నింగ్స్‌లో 503/9 వద్ద డిక్లేర్డ్

## ముగిసిన మూడో రోజు ఆట..

శ్రీలంకతో రెండో టెస్ట్‌లో టీమిండియా పట్టు బిగించింది. బ్యాటింగ్ తరహాలోనే బౌలింగ్‌లోనూ సత్తా చాటింది. దాంతో మూడో రోజు ఆట ముగిసే సమయానికి శ్రీలంక 83.4 ఓవర్లలో 8 వికెట్లకు 265 పరుగులు చేసింది. క్రీజులో లాహిరు కుమార(8 బ్యాటింగ్)తో పాటు సోనాల్ దినుషా(85 బ్యాటింగ్) ఉన్నాడు. పసిందు సూర్యబండార(133 బంతుల్లో 9 ఫోర్లతో 80) సెంచరీ చేసే అవకాశాన్ని చేజార్చుకున్నాడు. భారత బౌలర్లలో ప్రసిధ్ కృష్ణ(3/47), మానవ్ సుతార్(3/83) మూడేసి వికెట్లు తీయగా.. మహమ్మద్ సిరాజ్, రవీంద్ర జడేజా తలో వికెట్ పడగొట్టారు. అరంగేట్ర స్పిన్నర్ సారాన్ష్ జైన్ ఒక్క వికెట్ తీయలేకపోయాడు. శ్రీలంక ఇంకా 238 పరుగుల వెనుకంజలో ఉంది. నాలుగో రోజు ఆటలో వీలైనంత త్వరగా శ్రీలంకను ఆలౌట్ చేసి భారత్ బ్యాటింగ్‌కు దిగే అవకాశం ఉంది. ఒక సెషన్ పాటు బ్యాటింగ్ చేసి 300 ప్లస్ లక్ష్యాన్ని శ్రీలంక ముందు ఉంచి విజయం కోసం ప్రయత్నించనుంది. తొలి ఇన్నింగ్స్‌లో భారత్ 503/9 స్కోర్ వద్ద డిక్లేర్డ్ చేసిన సంగతి తెలిసిందే. 8/2 ఓవర్‌నైట్ స్కోర్‌తో మూడో రోజు ఆటను కొనసాగించిన శ్రీలంకకు ఆదిలోనే గట్టి షాక్ తగిలింది. కామిల్ మిషారా(19)ను ప్రసిధ్ కృష్ణ ఔట్ చేయగా.. కామిందు మెండీస్‌తో కలిసి పసిందు సూర్య బండార ఇన్నింగ్స్‌ను ముందుకు నడిపించాడు. ఈ క్రమంలో అతను 76 బంతుల్లో హాఫ్ సెంచరీ పూర్తి చేసుకున్నాడు. 87 పరుగుల భాగస్వామ్యంతో క్రీజులో పాతుకుపోయిన ఈ జోడీని ప్రసిధ్ కృష్ణ విడదీసాడు. కామిందు మెండీస్(32)ను క్యాచ్ ఔట్‌గా పెవిలియన్ చేర్చాడు. దాంతో శ్రీలంక 130/4 స్కోర్‌తో లంచ్ బ్రేక్‌కు వెళ్లింది. ఈ సమయంలో వర్షం అంతరాయం కలిగించడంతో రెండో సెషన్ ఆలస్యంగా ప్రారంభమైంది. సెకండ్ సెషన్ ఆరంభంలోనే ధనంజయ డిసిల్వా(8)ను మానవ్ సుతార్ పెవిలియన్ చేర్చాడు. దాంతో శ్రీలంక 137 పరుగులకే 5 వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడింది. ఈ పరిస్థితుల్లో సోనాల్ దినుషాతో కలిసి పసిందు జట్టును ఆదుకునే ప్రయత్నం చేశారు. సెంచరీ దిశగా సాగిన పసిందును జడేజా క్లీన్ బౌల్డ్ చేశాడు. ఆ వెంటనే నిరోషన్ డిక్‌వెల్లా(0)ను సిరాజ్ డకౌట్‌గా పెవిలియన్ చేర్చాడు. కేశర నువాంతతో కలిసి సోనాల్ దినుషా పోరాడాడు. తొలి టెస్ట్ ఫామ్‌ను కొనసాగిస్తూ.. 82 బంతుల్లో హాఫ్ సెంచరీ పూర్తి చేసుకున్నాడు. దాంతో శ్రీలంక 216/7 స్కోర్‌తో టీ బ్రేక్‌కు వెళ్లింది. ఆఖరి సెషన్‌లోనూ ఈ జోడీ ఆచితూచి ఆడింది. 57 పరుగుల భాగస్వామ్యంతో ప్రమాదకరంగా మారిన ఈ జోడీని మానవ్ సుతార్ విడదీసాడు. ఈ వికెట్‌తో 20 వికెట్ల మైలురాయి అందుకున్నాడు. లాహిరు కుమారా ఆచితూచి ఆడగా.. సోనాల్ దినుషా తనదైన శైలిలో బ్యాటింగ్ చేశాడు. మరో వికెట్ పడకుండా ఈ ఇద్దరూ జాగ్రత్త పడటంతో శ్రీలంక 265/8 స్కోర్ వద్ద మూడో రోజు ఆటను ముగించింది.

# చరిత్ర సృష్టించిన ధ్రువ్ జురెల్..



టీమిండియా యువ వికెట్ కీపర్ కమ్ బ్యాటర్ ధ్రువ్ జురెల్ చరిత్ర సృష్టించాడు. వరల్డ్ టెస్ట్ ఛాంపియన్‌షిప్(డబ్ల్యూటీసీ) చరిత్రలో విదేశీ గడ్డపై ఏడు అంత కంటే తక్కువ స్థానంలో ఆడి అత్యధిక పరుగులు చేసిన తొలి భారత బ్యాటర్‌గా నిలిచాడు. అంతేకాకుండా శ్రీలంక గడ్డపై ఏడో స్థానంలో వచ్చి సెంచరీ చేసిన తొలి భారత బ్యాటర్‌గా కూడా గుర్తింపు పొందాడు. కొలంబో వేదికగా శ్రీలంకతో జరుగుతున్న రెండో టెస్ట్‌లో ఏడో స్థానంలో బ్యాటింగ్‌కు వచ్చిన ధ్రువ్ జురెల్ (177 బంతుల్లో 9 ఫోర్లు, 2 సిక్స్‌లతో 115 నాటౌట్) అజేయ శతకంతో రాణించిన సంగతి తెలిసిందే. ఈ సెంచరీతో ధ్రువ్ జురెల్ తన పేరిట పలు రికార్డ్‌లను లిఖించుకున్నాడు. వరల్డ్ టెస్ట్ ఛాంపియన్‌షిప్ చరిత్రలోనే విదేశాల్లో జరిగిన టెస్ట్‌ల్లో ఏడు లేదా అంతకంటే తక్కువ స్థానంలో బ్యాటింగ్‌కు వచ్చి సెంచరీ బాదిన మూడో భారత బ్యాటర్ ధ్రువ్ జురెల్. అతని కంటే ముందు రవీంద్ర జడేజా, నితీష్ కుమార్ రెడ్డి ఈ ఫీట్ సాధించారు. 2024లో ఆస్ట్రేలియా గడ్డపై జరిగిన బోర్డర్ గవాస్కర్ ట్రోఫీలో మెల్‌బోర్న్ వేదికగా జరిగిన మ్యాచ్‌లో 8వ స్థానంలో బ్యాటింగ్ చేసిన నితీష్ కుమార్ రెడ్డి 114 పరుగులు చేశాడు. 2022లో ఇంగ్లండ్‌తో జరిగిన బర్మింగ్‌హామ్ టెస్ట్‌లో ఏడో స్థానంలో బ్యాటింగ్ చేసిన రవీంద్ర జడేజా 104 పరుగులు చేశాడు. తాజాగా ధ్రువ్ జురెల్ 115 పరుగులతో అజేయంగా నిలిచి ఈ ఇద్దర్ని వెనక్కి నెట్టి ఏడు లేదా అంతకంటే తక్కువ స్థానాల్లో బ్యాటింగ్ చేసి అత్యధిక పరుగులు చేసిన ఆటగాడిగా గుర్తింపు పొందాడు. ఓవరాల్‌గా ఈ ఫీట్ సాధించిన 9వ బ్యాటర్‌గా జురెల్ నిలిచాడు. ఈ జాబితాలో రిషభ్ పంత్(159) అగ్రస్థానంలో ఉన్నాడు. శ్రీలంకతో టెస్ట్‌ల్లో సెంచరీ బాదిన నాలుగో భారత వికెట్ కీపర్ కమ్, ఏడో బ్యాటర్‌గా కూడా ధ్రువ్ జురెల్ నిలిచాడు. అతని కంటే ముందు శ్రీలంకపై కపిల్ దేవ్, ధోనీ, రవీంద్ర జడేజా ఈ ఫీట్ సాధించారు. అయితే శ్రీలంక గడ్డపై సెంచరీబాదిన తొలి నెంబర్ 7 భారత బ్యాటర్‌గా ధ్రువ్ జురెల్ గుర్తింపు పొందాడు.




# శ్రీలంక బ్యాటర్‌పై ఐసీసీ చర్యలు..

శ్రీలంక బ్యాటర్ ప్రభాత్ జయసూర్యపై అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్(ఐసీసీ) చర్యలు తీసుకుంది. భారత్‌తో కొలంబో వేదికగా జరుగుతున్న రెండో టెస్ట్‌లో ప్రభాత్ జయసూర్య..ఐసీసీ నియమావళిని ఉల్లంఘించాడనే కారణంతో ఓ డీ మెరిట్ పాయింట్ కేటాయించడంతో పాటు మందలించింది. రెండో రోజు ఆటలో మానవ్ సుతార్ బౌలింగ్‌లో ఔటైన ప్రభాత్ జయసూర్య.. మైదానం వీడే సమయంలో బౌండరీ లైన్‌ను బ్యాట్‌తో కొట్టాడు. ఈ చర్య ఐసీసీ ఆర్టికల్ 2.2 క్రికెట్ పరికరాలు, దుస్తులు, మైదాన సామగ్రిని ధ్వంసం చేయడం కిందికి వస్తుంది. దాంతో అతను ఐసీసీ లెవెల్ 1 రూల్‌ను ఉల్లంఘించినట్లు తేలింది. ప్రభాత్ జయసూర్య తన తప్పిదాన్ని, విధించిన శిక్షను అంగీకరించాడు. దాంతో ఈ వ్యవహారానికి సంబంధించి తదుపరి విచారణ అవసరం లేదని ఐసీసీ తమ ప్రకటనలో పేర్కొంది. ఈ మ్యాచ్‌లో ముందుగా బ్యాటింగ్ చేసిన భారత్ తొలి ఇన్నింగ్స్‌ను 503/9 భారీ స్కోర్ వద్ద డిక్లేర్డ్ చేసింది. ధ్రువ్ జురెల్(177 బంతుల్లో 9 ఫోర్లు, 2 సిక్స్‌లతో 115 నాటౌట్), దేవదత్ పడిక్కల్(193 బంతుల్లో 12 ఫోర్లతో 117) సెంచరీలతో రాణించగా.. రిషభ్ పంత్(89 బంతుల్లో 6 ఫోర్లు, 2 సిక్స్‌లతో 63), శుభ్‌మన్ గిల్(108 బంతుల్లో 6 ఫోర్లతో 50) హాఫ్ సెంచరీలతో సత్తా చాటారు. శ్రీలంక బౌలర్లలో అసితా ఫెర్నాండో(4/106) నాలుగు వికెట్లు తీయగా..ప్రభాత్ జయసూర్య, కేశర నువాంత్ చెరో రెండు వికెట్లు పడగొట్టారు. లాహిరు కుమారాకు ఒక వికెట్ దక్కింది.అనంతరం శ్రీలంక మూడో రోజు ఆట ముగిసే సమయానికి 83.4 ఓవర్లలో 8 వికెట్లకు 265 పరుగులు చేసింది. క్రీజులో లాహిరు కుమార(8 బ్యాటింగ్)తో పాటు సోనాల్ దినుషా(85 బ్యాటింగ్) ఉన్నాడు. పసిందు సూర్యబండార(133 బంతుల్లో 9 ఫోర్లతో 80) సెంచరీ చేసే అవకాశాన్ని చేజార్చుకున్నాడు. భారత బౌలర్లలో ప్రసిధ్ కృష్ణ(3/47), మానవ్ సుతార్(3/83) మూడేసి వికెట్లు తీయగా.. మహమ్మద్ సిరాజ్, రవీంద్ర జడేజా తలో వికెట్ పడగొట్టారు. అరంగేట్ర స్పిన్నర్ సారాన్ష్ జైన్ ఒక్క వికెట్ తీయలేకపోయాడు. శ్రీలంక ఇంకా 238 పరుగుల వెనుకంజలో ఉంది.




# సెమీఫైనల్ రేసు నుంచి వైదొలిగిన భారత్

## • అర్జెంటీనా చేతిలో

## 3-5 గోల్స్ తేడాతో ఓటమి




పురుషుల హాకీ వరల్డ్ కప్ 2026 టోర్నమెంట్‌లో భారత జట్టుకు పరాభవం కలిగింది.. సోమవారం అర్జెంటీనాతో జరిగిన కీలకమైన పూల్ ఈ మ్యాచ్‌లో భారత్ 3-5 గోల్స్ తేడాతో ఘోర ఓటమి ఎదుర్కొంది. సెమీఫైనల్ చేరాలంటే కనీసం మూడు గోల్స్ తేడాతో గెలవాల్సిన తప్పనిసరి పరిస్థితిలో బరిలోకి దిగిన భారత జట్టు, ఆరంభం నుంచే తీవ్ర ఒత్తిడిలో కూరుకుపోయింది. ఈ ఓటమితో పూల్ ఈ లో ఆడిన మూడు మ్యాచ్‌ల్లోనూ ఒక్క పాయింట్ కూడా సాధించలేకపోయిన ఇండియా సెమీస్ ఆశలు ఆవిరయ్యాయి. పూల్ ఈ నుంచి నెదర్లాండ్స్ ఇప్పటికే సెమీఫైనల్ బెర్తును దక్కించుకుంది. మ్యాచ్ మొదలైన మొదటి నిమిషంలోనే అర్జెంటీనా ఆటగాడు జోక్విన్ తోస్కాని అద్భుతమైన ఫీల్డ్ గోల్ చేసి భారత గోల్ కీపర్ మోహిత్ ను బురిడి కొట్టించాడు. ఆ తర్వాత ఆరో నిమిషంలో నికోలస్ డెల్లా టోర్రే పెనాల్టీ కార్నర్‌ను గోల్‌గా మలచి అర్జెంటీనా ఆధిక్యాన్ని 2-0 తో రెట్టింపు చేశాడు. 10వ నిమిషంలో అభిషేక్ అందించిన పాస్‌తో సుఖ్‌జీత్ సింగ్ గోల్ కొట్టి భారత్‌ను రేసులోకి తెచ్చేందుకు ప్రయత్నించాడు. అయితే పాసింగ్ లోపాలు, బంతి నియంత్రణ కోల్పోవడం వల్ల భారత దాడులు వరుసగా నిరాశ పర్చాయి. రెండో క్వార్టర్‌లో ఎలాంటి గోల్స్ నమోదు కాకపోవడంతో హాఫ్ టైమ్ సమయానికి భారత్ 1-2 తో వెనుకంజలో నిలిచింది. మూడో క్వార్టర్ ప్రారంభమైన వెంటనే అర్జెంటీనా మరింత దూకుడు కనబర్చింది. 33వ నిమిషంలో టోమస్ డొమెనె రివర్స్ హిట్‌తో గోల్ చేసి ఆధిక్యాన్ని 3-1 కి పెంచాడు.

ఆ తర్వాత భారత డిఫెన్స్ చేసిన తప్పిదాన్ని సొమ్ము చేసుకుంటూ డొమెనె పెనాల్టీ స్ట్రోక్‌ను గోల్‌గా మార్చి స్కోరును 4-1 గా తిరుగులేని విధంగా మలిచాడు. దీంతో టోర్నమెంట్‌లో అతడి గోల్స్ సంఖ్య ఏడుకు చేరి, హర్మన్‌ప్రీత్ సింగ్ (6 గోల్స్) ను దాటాడు. కెప్టెన్ హర్మన్‌ప్రీత్ సింగ్ డ్రాగ్ ఫ్లిక్స్‌ను అర్జెంటీనా డిఫెండర్లు సమర్థవంతంగా అడ్డుకోవడంతో భారత్‌కు దక్కిన పెనాల్టీ కార్నర్లు వృథాగా మారాయి. 53వ నిమిషంలో లూకాస్ తోస్కాని అర్జెంటీనా తరఫున ఐదో గోల్ నమోదు చేశాడు. మ్యాచ్ చివరి నిమిషాల్లో 58వ నిమిషంలో సుఖ్‌జీత్ సింగ్ తన రెండో గోల్ నమోదు చేయగా, 59వ నిమిషంలో హార్దిక్ సింగ్ పెనాల్టీ స్ట్రోక్‌ను గోల్‌గా చేశాడు. అయినప్పటికీ భారత్ 3-5 తో ఓటమి పాలైంది.భారత్ ఏడు లేదా ఎనిమిదో స్థానం కోసం జరిగే క్లాసిఫికేషన్ మ్యాచ్‌లలో ఆడాల్సి ఉంటుంది.

# మేధావి బిధూరి సిక్స్ సెవెన్ సెలబ్రేషన్ వైరల్

విమెన్స్ ఢిల్లీ ప్రీమియర్ లీగ్ (డబ్ల్యూడీపీఎల్) 2026 సీజన్ ఓపెనింగ్ మ్యాచ్ లో యువ లెగ్ స్పిన్నర్ మేధావి బిధూరి చేసిన వినూత్న వికెట్ సంబరం ఇంటర్నెట్ లో సెన్సేషన్ గా మారి పోయింది. సెంట్రల్ ఢిల్లీ క్వీన్స్ తరఫున ఆడుతున్న బిధూరి, సౌత్ ఢిల్లీ సూపర్‌స్టార్జ్ బ్యాటర్ నిషికా సింగ్ ను 16వ ఓవర్లో అవుట్ చేసిన తర్వాత చేసిన “6-7” సెలబ్రేషన్ అభిమానులను విపరీతంగా అలరించింది. ఆరుషి గోయల్ మిడ్ వికెట్ లో క్యాచ్ పట్టగానే బిధూరి వేళ్లతో చేసిన ఈ జెస్చర్ వీడియో సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్‌లలో విపరీతంగా షేర్ అవుతోందని తెలుస్తోంది. మ్యాచ్ ముగిసిన తర్వాత మేధావి బిధూరి మాట్లాడుతూ ఈ సెలబ్రేషన్ వెనుక ఉన్న అసలు కారణాన్ని వివరించింది. మొదట ఆమె 12వ నంబర్ జెర్సీని తీసుకోవాలని అనుకున్నప్పటికీ, ఆ నంబర్ అప్పటికే వేరే ప్లేయర్‌కు కేటాయించడంతో ఆమె 67వ నంబర్ జెర్సీని సెలెక్టు చేసుకుంది. “ప్రస్తుతం ఈ సిక్స్-సెవెన్ ట్రెండ్ నడుస్తోంది. నా చెల్లెలు నన్ను 67వ నంబర్ జెర్సీ ధరించమని, వికెట్ పడినప్పుడు ఇలాగే సెలబ్రేట్ చేసుకోమని సూచించింది” అని మేధావి పేర్కొంది. ఢిల్లీ డొమెస్టిక్ క్రికెట్ సెటప్‌లో మేధావి బిధూరి చాలా కాలంగా స్థిరమైన ప్రదర్శన నమోదు చేస్తోంది.



అండర్-19 స్థాయిలో ఢిల్లీకి ప్రాతినిధ్యం వహించిన ఈ రైట్ ఆర్మ్ లెగ్ స్పిన్నర్, గత 2025 సీజన్ ఫైనల్లో సౌత్ ఢిల్లీ సూపర్‌స్టార్జ్ తరఫున ఆడి 3/26 గణాంకాలతో జట్టును ఒక్క పరుగు తేడాతో ఛాంపియన్‌గా నిలపడంలో అద్భుత ప్రదర్శన కనబర్చింది. విమెన్స్ ప్రీమియర్ లీగ్ (డబ్ల్యూపీఎల్) 2024 వేలంలోనూ ఆమె పేరు నమోదు కావడం విశేషం. మేధావి బిధూరి సెలబ్రేషన్ క్రేజ్ ఎంతలా పెరిగిందంటే భారత వెటరన్ లెగ్ స్పిన్నర్ యుజ్వేంద్ర చాహల్ కూడా దీన్ని కాపీ చేసి, సరదా తీర్చుకున్నాడు. ఇంగ్లాండ్‌లో జరుగుతున్న కౌంటీ ఛాంపియన్‌షిప్ మ్యాచ్‌లో నార్తాంప్టన్‌షైర్ తరఫున ఆడుతూ లాంక్షైర్ బ్యాటర్ జో మూర్స్ ను అవుట్ చేసిన తర్వాత చాహల్ ఇదే “6-7ష గెస్చర్‌తో దుమ్మురేపాడు. ఓల్డ్ ట్రాఫోర్డ్ మైదానంలో చాహల్ చేసిన ఈ పనితో భారత మహిళా క్రికెటర్ స్టైల్ అంతర్జాతీయ స్థాయిలో మరింతగా పాపులర్ అయిందనడంలో సందేహం లేదు.

బుధవారం ,
ఆగస్టు 26, 2026

మన విశ్వం
VOICE OF THE PEOPLE-POWER OF TRUTH
తెలుగు వార్తా దినపత్రిక



# దేశ విభజన నేపథ్యంలో బట్వారా 1947




### పేలవ ప్రదర్శనతో ఆకట్టులోకపోయిన చిత్రం

సన్నీ డియోల్ హీరోగా దేశ విభజన గాథ నేపథ్యంలో ఆమిర్ ఖాన్ నిర్మించిన 'బట్వారా 1947' చిత్రం ఆగస్ట్ 14న విడుదలైంది. ఈ సినిమా బాక్సాఫీస్ బరిలో చాలా పేలవమైన ప్రభావాన్ని చూపించింది. దీనికి ముందు ఇదే తరహాలో వచ్చిన 'మై వాపస్ ఆవుంగా' దీనికంటే బెటర్ గా పెర్ఫార్మ్ చేసిందని ట్రేడ్ వర్గాలు చెబుతున్నాయి. 'బట్వారా' చిత్రంతో ఆమిర్ ఖాన్‌కు దాదాపు 90 కోట్ల నష్టం వచ్చిందని అంచనా వేస్తున్నారు. అయితే ఇప్పుడీ సినిమా ఓటీటీ డీల్ సందిగ్ధంలో పడింది. నిజానికి సినిమా రిలీజ్ కు ముందు ఓ ప్రముఖ ఓటీటీ సంస్థ రూ. 125 కోట్లను ఆఫర్ చేసిందట. కానీ అప్పుడు అందుకు ఆమిర్ ఖాన్ అంగీకరించలేదని తెలిసింది. ఇప్పుడు సినిమా విడుదలై పరాజయం పాలు కావడంతో ఏ ఓటీటీ ప్లాట్ ఫామ్ కూడా దీని హక్కులపై ఆసక్తి చూపడం లేదట. 'బట్వారా' సినిమా విడుదలకు ముందే ఓటీటీ డీల్ కుదర్చుకోమని, ఆ కారణంగా ఆర్థికంగా ఉపయోగపడుతుందని ఆమిర్‌కు సన్నీడియోల్ చెప్పినట్టు వార్తలు వచ్చాయి. అయితే ఆయన దానిని ఖండించారు. తమ మధ్య ఓటీటీ డీల్‌కు సంబంధించి ఎలాంటి చర్చ జరగలేదని ఆయన అన్నారు. 'బట్వారా' సినిమా విషయంలో తాను గర్వం పడుతుంటానని, బాక్సాఫీస్ ఫలితాలు సినిమా క్వాలిటీని ప్రతిఫలించవని ఆయన తెలిపారు. తన తండ్రి కెరీర్ లో హృషికేశ్ ముఖర్జీ తీసిన 'సత్యకామ్' ఉత్తమ చిత్రంగా తాను భావిస్తానని, కాని ఆ సినిమా బాక్సాఫీస్ దగ్గర భారీ పరాజయాన్ని చవిచూసిందని సన్నీ డియోల్ చెప్పారు. అయితే 'బట్వారా' నష్టాలు రాబోయే రోజుల్లో భర్తీ అవుతాయనే ఆశాభావాన్ని ఆయన వ్యక్తం చేశారు.

Cinema Madness




# తెలుగులో విడుదలవుతున్న 'బెత్లెహెమ్ కుటుంబ యూనిట్'

మలయాళ సినీ పరిశ్రమలో సంచలన విజయాలను నమోదు చేస్తూ బాక్సాఫీస్ వద్ద దూసుకుపోతున్న సరికొత్త ఫీల్-గుడ్ లవ్ అండ్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ 'బెత్లెహెమ్ కుడుంబ యూనిట్' ఇప్పుడు తెలుగు ప్రేక్షకులను అలరించడానికి సిద్ధమైంది. 'బెత్లెహెమ్ కుటుంబ యూనిట్' అనే పేరుతో రాబోతున్న ఈ సినిమాను టాలీవుడ్ ప్రముఖ నిర్మాణ సంస్థ మైత్రీ మూవీ మేకర్స్ ఘనంగా విడుదల చేయబోతుంది.యువ కథానాయకుడు నివిన్ పౌలి హీరోగా, సెన్సేషనల్ నటి మమితా బైజు నాయికగా నటించిన ఈ చిత్రానికి గిరీష్ ఎ.డి. దర్శకత్వం వహించారు. కేరళలో ఓణం కానుకగా విడుదలైన ఈ సినిమా అంచనాలకు మించి భారీ వసూళ్లను రాబట్టడమే కాకుండా, ప్రేక్షకుల నుంచి ప్రశంసల వర్షాన్ని అందుకుంది. ముఖ్యంగా నివిన్ పౌలి నటన మరియు మమితా బైజుతో ఆయన ఆన్-స్క్రీన్ కెమిస్ట్రీ ప్రేక్షకులను ఎంతగానో కట్టుపడేసింది. ఇక 'ప్రేమలు' చిత్రంతో తెలుగు ప్రేక్షకులకు అత్యంత దగ్గరైన మమితా బైజు నటిస్తున్న మరో చిత్రం కావడంతో టాలీవుడ్‌లోనూ ఈ సినిమాపై భారీ అంచనాలు నెలకొన్నాయి. భావనా స్టూడియోస్ నిర్మాణంలో తెరకెక్కిన ఈ చిత్రాన్ని ఫ్యూచర్ రన్-అప్ సహకారంతో మైత్రీ రిలీజ్ సంస్థ తెలుగు ప్రేక్షకులకు అందిస్తోంది. అన్ని కార్యక్రమాలు పూర్తి చేసుకున్న ఈ చిత్రం సెప్టెంబర్ 4న థియేటర్లలో విడుదల కానుంది. మలయాళంలో తిరుగులేని విజయం సాధించిన ఈ చిత్రం తెలుగు ప్రేక్షకులను కూడా కచ్చితంగా అలరిస్తుందని చిత్రయూనిట్ ధీమా వ్యక్తం చేస్తోంది.

# ఇరుముడికి ఫ్యామిలీ ఆడియెన్స్ బ్రహ్మరథం

## - కలెక్షన్లలో వందకోట్ల క్లబ్బుకు చేరిన మూవీ

మాస్ మహారాజా రవితేజ హీరోగా, దర్శకుడు శివ నిర్వాణ తెరకెక్కించిన తాజా చిత్రం 'ఇరుముడి' బాక్సాఫీస్ వద్ద దూసుకుపోతోంది. విడుదలైన తొలి రోజు నుంచే పాజిటివ్ టాక్‌తో ప్రేక్షకులను ఆకట్టుకుంటున్న ఈ సినిమా కలెక్షన్ల పరంగా సరికొత్త రికార్డులు సృష్టిస్తోంది. ప్రముఖ నిర్మాణ సంస్థ మైత్రీ మూవీ మేకర్స్ నిర్మించిన ఈ చిత్రం కేవలం నాలుగు రోజుల్లోనే ప్రపంచవ్యాప్తంగా రూ.100 కోట్ల గ్రాస్ మార్క్‌ను అందుకుంది. రవితేజ కెరీర్‌లో అత్యంత వేగంగా రూ.100 కోట్ల గ్రాస్ క్లబ్‌లో చేరిన చిత్రంగా 'ఇరుముడి' నిలిచింది. చాలా కాలంగా ఒక భారీ కమర్షియల్ హిట్ కోసం ఎదురుచూస్తున్న రవితేజకు ఈ చిత్రం కెరీర్‌లోనే ప్రత్యేకమైన విజయాన్ని అందించిందని అభిమానులు సంబరాలు చేసుకుంటున్నారు.సాధారణంగా వీకెండ్ ముగిసిన తర్వాత వచ్చే మొదటి సోమవారం చాలా సినిమాల బుకింగ్స్, ఆక్యుపెన్సీలు తగ్గడం సహజం. కానీ 'ఇరుముడి' విషయంలో మాత్రం పరిస్థితి భిన్నంగా కనిపించింది. విడుదలైన నాలుగో రోజు కూడా సినిమా బుకింగ్స్ బలంగా కొనసాగడంతో ట్రేడ్ వర్గాలు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నాయి. మొదటి రోజు స్థాయికి దగ్గరగా బుకింగ్స్ నమోదవడం 'ఇరుముడి'పై ప్రేక్షకుల్లో ఉన్న క్రేజ్‌ను తెలియజేస్తోంది. రీజినల్ సినిమాల్లో ఫస్ట్ మండే బుకింగ్స్ పరంగా కూడా ఈ చిత్రం కొత్త రికార్డులు నమోదు చేసినట్లు తెలుస్తోంది. 'ఇరుముడి' హవా టికెట్ సేల్స్‌లోనూ స్పష్టంగా కనిపిస్తోంది.



### ఏకి పడేసిన నటి, ఎంపి కంగనా రనౌత్

కృతి సనన్ ఇటీవల నటించిన ఓ యాడ్ ప్రస్తుతం చర్చనీయాంశంగా మారింది. దీనిపై ఇప్పటికే నెట్టింట విమర్శలు రాగా.. బాలీవుడ్ నటి, ఎంపీ కంగనా రనౌత్ తాజాగా మండిపడ్డారు. రక్షా బంధన్ అంటే ప్రతి సోదరికీ ఎంతో ప్రత్యేకమైన రోజు. అంత గొప్ప సమయంలో హుందాగా కనిపించాలి. ఈ సాంప్రదాయ పండగకు సంబంధించిన ప్రకటనలో ఇలాంటి దుస్తులా ధరించేది. ఈ రోజుల్లో మహిళలకు లెహంగాలు, జీన్స్, సల్వార్ కమీజ్, చీరలు, పంజాబీ డ్రెస్‌లు.. ఇన్ని రకాలు ఉన్నాయి. ఇన్ని ఉన్నా.. ఇలాంటి బికినీ ధరించి రాఖీ ఎందుకు కడతారు?. ఈ యాడ్ చేసిన స్టైలిష్ట్‌కు ఈ ఆప్షన్లు కనిపించలేదా? ఈ యాడ్ ఉద్దేశపూర్వకంగా చేసినట్లుంది. చాలా అసహ్యంగా కనిపిస్తోందని తన ఇన్‌స్టాలో రాసుకొచ్చారు. ఇటీవల విడుదలైన ఈ యాడ్‌పై తీవ్ర విమర్శలు వస్తున్నాయి. సోషల్ మీడియా వేదికగా కృతిని ట్రోల్ చేస్తున్నారు. డ్రెస్‌తో పాటు.. ఈ యాడ్‌లో పెంపుడు కుక్కకు రాఖీ కడుతూ కృతి కనిపించడంతో విమర్శలు మరింత ఎక్కువయ్యాయి. ఈ యాడ్‌పై ఇప్పటి వరకూ యాజమాన్యం, కృతి సనన్ స్పందించలేదు.


## బికినీలో కృతిసనన్ రక్షాబంధన్ సెలబ్రేషన్స్



# నటనను నీ నుంచి నేర్చుకోవాల్సిందే

## - బేబీ నక్షత్రకు నటుడు ధనుష్ ప్రశంసలు

'ఇరుముడి' చిత్రం ప్రేక్షకుల నుంచి మంచి ఆదరణ అందుకుంటోంది. ముఖ్యంగా సినిమాలోని కథ, భావోద్వేగ సన్నివేశాలు, నటీనటుల ప్రదర్శన ప్రేక్షకులను ఆకట్టుకుంటున్నాయి. ఈ సినిమాలో రవితేజ నటనతో పాటు ఆయన కుమార్తె పాత్రలో నటించిన బాలనటి బేబీ నక్షత్ర నటనకు విశేష ప్రశంసలు దక్కుతున్నాయి. తండ్రి-కూతుళ్ల మధ్య ఉండే అనుబంధాన్ని తెరపై ఎంతో భావోద్వేగంగా చూపించడంలో ఈ ఇద్దరి నటన కీలక పాత్ర పోషించిందని ప్రేక్షకులు అభిప్రాయపడుతున్నారు. 'ఇరుముడి' సక్సెస్ మీట్ తర్వాత దర్శకుడు శివ నిర్వాణ బేబీ నక్షత్రకు ఒక ప్రత్యేకమైన సర్‌ప్రైజ్ ఇచ్చారు. జాతీయ అవార్డు గ్రహీత, ప్రముఖ నటుడు ధనుష్‌తో నక్షత్రకు వీడియో కాల్ ఏర్పాటు చేశారు. సినిమాలో ఆమె నటనను చూసిన ధనుష్ చిన్నారిని ప్రత్యేకంగా అభినందించారు. ఈ వీడియో కాల్‌లో ధనుష్ మాట్లాడిన మాటలు ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. నక్షత్ర నటనను ప్రశంసిస్తూ, ఎప్పుడైనా ఇద్దరం కలిసినప్పుడు 'నేను నీ దగ్గర నటన నేర్చుకోవాలి' అంటూ సరదాగా చెప్పారు.. ఒక స్టార్ హీరో, జాతీయ అవార్డు విజేత నుంచి ఇలాంటి ప్రశంసలు రావడంతో నక్షత్ర ఆనందానికి అవధులు లేకుండా పోయాయి.ధనుష్‌తో జరిగిన ఈ ప్రత్యేక సంభాషణను బేబీ నక్షత్ర తన ఇన్‌స్టాగ్రామ్‌లో పంచుకున్నారు. దీంతో ఈ వీడియో నెటిజన్ల దృష్టిని ఆకర్షించి వైరల్‌గా మారింది.



## నేడు విడుదలవుతున్న టాక్సిక్

### - టిక్కెట్ రేట్ల పెంపునకు తెలంగాణలో అనుమతి

కన్నడ రాకింగ్ స్టార్ యశ్ హీరోగా నటిస్తున్న పాన్ ఇండియా మూవీ 'టాక్సిక్' ఆగస్టు 26 ప్రపంచవ్యాప్తంగా విడుదల కానున్న తరుణంలో, తెలంగాణ ప్రభుత్వం సినిమా టికెట్ ధరలను పెంచుకునేందుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఈ మేరకు హోమ్ శాఖ తాజాగా ఉత్తర్వులు జారీ చేసింది. ప్రభుత్వం జారీ చేసిన జీవో ప్రకారం.. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న సింగిల్ స్క్రీన్ థియేటర్లలో జీఎస్టీతో కలుపుకుని రూ. 50, అలాగే మల్టీప్లెక్స్‌లు మరియు స్పెషల్ థియేటర్లలో రూ. 100 వరకు అదనంగా టికెట్ ధరలను పెంచుకోవడానికి అనుమతిని ఇచ్చారు. పెంచిన ధరలు సినిమా విడుదలైన రోజు నుంచి సెప్టెంబర్ 4 వరకు పది రోజుల పాటు అమలులో ఉంటాయి. అలాగే ఈ పది రోజుల పాటు రోజుకు అదనంగా ఒక షోతో కలుపుకుని మొత్తం 5 షోలు ప్రదర్శించుకోవడానికి ప్రభుత్వం వెసులుబాటు కల్పించింది. ధరల పెంపుతో పాటు మరికొన్ని కీలక నిబంధనలను కూడా ఖరారు చేసింది. సినీ కార్మికుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని, తెలుగు ఫిల్మ్ ఇండస్ట్రీ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ అకౌంట్‌కు నిర్మాణ సంస్థ 'కేవీఎన్-మాన్స్టర్ మైండ్ క్రియేషన్స్ ఎల్‌ఎల్‌పీ' తక్షణమే రూ. 1 కోటి విరాళంగా అందించాలని ప్రభుత్వం స్పష్టం చేసింది. ఈ నిధులను పూర్తిగా సినీ కార్మికుల సంక్షేమం కోసం మాత్రమే ఖర్చు చేయనున్నారు. అలాగే, సినిమా ప్రదర్శన సమయంలో మాదకద్రవ్యాలు, నార్కోటిక్స్ మరియు సైబర్ క్రైమ్ వల్ల కలిగే దుష్ప్రభావాలపై ప్రజలకు, ముఖ్యంగా యువతకు అవగాహన కల్పించే ప్రత్యేక ప్రకటనలను తప్పనిసరిగా ప్రదర్శించాలని థియేటర్ల యాజమాన్యాలను ప్రభుత్వం ఆదేశించింది. ఈ నిబంధనలన్నీ ఎలాంటి లోపాలు లేకుండా కచ్చితంగా అమలయ్యేలా పర్యవేక్షించే బాధ్యతను జిల్లా కలెక్టర్లు, పోలీస్ కమిషనర్లు మరియు సినిమా లైసెన్సింగ్ అధికారులకు




"MANA VISHWAM" vide PRGI Registration No. "TGTEL/26/A4450" Printed by SRI VENKATESWARA PRINTING SOLUTIONS, Published by Nameendla Pramod on behalf of Nameendla Pramod, printed at 11-1/B/42, BPM GREEN LANDS COLONY, PRVATHAPUR, MEDIPALLY MANDAL AND DIVISION, GHMC, MEDCHAL MALKAJGIRI, TELANGANA - 500098 and published at H No 2-96, Geesugonda, Gorrekunta editor Nameendla Pramod. Gmail- manavishwamtelugudaily@gmail.com, Cell- 6305638569